# కాశ్మీర్ లోయలో హిందువుల ప్రాణాలకు భద్రత లేదా.!

## (స్వతంత్ర భారత వజ్రోత్సవాల సందర్భంగా సవాళ్ల నడుమ సాఫల్యతలు)

ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేస్తూ ఆగస్టు 2019 నుంచి నేటి వరకు 118 మంది అమాయక మైనారిటీ హిందూ పౌరులు, అందులో 21 మంది కాశ్మీరీ పండితులు, సిక్కులు, ఇతర హిందూ పౌరులు ఉగ్రవాదుల చేతుల్లో హత్య చేయబడ్డారని తెలుపడం మనకు విధితమే. కాశ్మీర్‌లో నివసిస్తున్న మైనారిటీ హిందువులకు భద్రత కరువైందని, వారు ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని భయం భయంతో బతుకుతున్నారని అక్కడి నెలకొన్న భయానక వాతావరణం వివరిస్తున్నది. మార్చి 2021 ప్రభుత్వ వివరాల ప్రకారం 520 మంది కాశ్మీరీ పౌరులు తిరిగి తమ కాశ్మీరీ లోయ ప్రాంతాల్లో ఉద్యోగం చేయడానికి వచ్చారని, కనీసం మరో 2000 మంది తమ పూర్వ ప్రాంతాలకు చేరడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపింది. ఆర్టికల్ 370 రద్దు, జె అండ్ కె పునర్వ్యవస్థీకరణ అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక పునరావాస పథకం ప్రకారం కాశ్మీరీ పండితులు, సిక్కులు, మైనారిటీ హిందువులకు ఉద్యోగాలు కల్పించి కాశ్మీర్ లోయలో బదిలీకి ఆస్కారంలేని పోస్టింగ్స్ ఇవ్వడంతో పాటు 7.5 లక్షల ఆర్థిక సహాయం, తాత్కాలిక గృహ వసతులు కల్పించడానికి వెసులుబాటు కల్పించారు.

కాశ్మీరీ లోయలో ఉద్యోగాలు పొందిన మైనారిటీ హిందువులు, సిక్కుల ప్రాణాలకు హాని పొంచి ఉందని, ఏ క్షణంలోనైనా ఏ వైపు నుంచైనా ఉగ్రవాదులు దాడి చేయవచ్చనే భయంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ఉద్యోగాలు చేయవలసి వస్తున్నది. గత మూడు మాసాలుగా మైనారిటీ హిందువులు వరుసగా హత్య చేయబడడంతో తమను సురక్షిత ప్రాంతాలకు బదిలీ చేయాలని ప్రభుత్వానికి వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల బుద్గామ్ తహసిల్‌లో పని చేస్తున్న క్లర్క్ రాహుల్ భట్, రాజస్థానీ హిందూ బ్యాంకు ఉద్యోగి, బీహారీ ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికుడు, ఒక సిక్ స్కూల్ ప్రిన్సిపల్, ఒక దళిత స్కూల్ టీచర్ లాంటి పలువురు మైనారిటీ హిందువులు ఉగ్రవాదుల చేతుల్లో హత్య కాబడ్డారు. హిందు దంపతులు రాజ్‌కుమార్, రజనీ బాలలు కాశ్మీరీ లోయలో అభద్ర వాతావరణంలో ఉద్యోగాలు చేస్తూ సురక్షిత ప్రాంతాలకు బదిలీ చేయాల్సిందిగా అభ్యర్ధించారు. ఉద్యోగ బదిలీ పొందిన రజనీ బాల్‌ను చివరి రోజున ఉగ్రవాదులు హత్య చేయడం జరిగింది. భార్య హత్య అనంతరం భర్త రాజ్‌కుమార్‌ను ప్రభుత్వం విధిలేనా పరిస్థితిలో సురక్షిత ప్రాంతానికి బదిలీ చేసింది.

కాశ్మీరీ లోయలో పని చేస్తున్న 5,000లకు పైగా మైనారిటీ హిందువులు తమకు భద్రత కావాలని, ఏ క్షణం ఏ వైపు నుంచి మరణం వస్తుందో తెలియని దుస్థితిలో విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేయడం బాధగా ఉన్నది. నేడు లోయలో పని చేస్తున్న మైనారిటీ హిందువులు జీవనానికి, జీవనభృతికి మధ్య కొట్టుమిట్టాడుతున్నారని అర్థం అవుతున్నది. ప్రభుత్వ పునరావాస పథకం ద్వారా హిందువులకు లోయలో 'బదిలీకి వీలుకాని ఉద్యోగ పోస్టింగులు' ఇవ్వడం ద్వారా వారిని కాశ్మీర్‌లోకి పునరాగమన ప్రక్రియలను చేపట్టారు. తమ ప్రాణాలతో పాటు తమ బతుకులతో ప్రభుత్వం ఆటలు ఆడుకుంటోందని, తమ ప్రాణానికి సంపూర్ణ భద్రత ఇవ్వడానికి ప్రభుత్వం పూర్తి హామీ ఇవ్వాలని కోరడం సముచితంగా ఉంది. 1990ల్లో తమ కుటుంబాలను లోయలో కోల్పోయామనే వాస్తవాన్ని ఇటీవల విడుదలైన 'ది కాశ్మీర్ ఫైల్స్' సినిమా కళ్ల ముందు ఉంచిందని, నేడు మళ్లీ అదే దుస్థితిలో ఉద్యోగ ఉపాధులు చేస్తున్నామని, మైనారిటీ హిందువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత 32 ఏండ్లుగా కాశ్మీరీ పండితులు, సిక్కులు తీవ్రమైన హింసలు, ఊచకోతలకు లోనవుతూ లోయను వదిలి ప్రాణాలు కాపాడుకున్నారనే వాస్తవాన్ని పండితులు గుర్తు చేస్తున్నారు. కాశ్మీరీ హిందూ ఉద్యోగులను బదిలీ చేస్తే ఉగ్రవాదులకు భయపడి చేస్తూన్నారనే వాదనలు వినిపిస్తాయని ప్రభుత్వం భావిస్తున్నది. నేడు లోయలోని మైనారిటీ హిందువులు, సిక్కులు భద్రత కావాలని చేస్తున్న శాంతియుత ఉద్యమాలను ప్రభుత్వం సునిశితంగా పరిశీలించాల్సిందే. ప్రాణాలను గాల్లో దీపాలుగా చేసుకొని అనుక్షణం భయం గుప్పిట్లో విధులు నిర్వహించలేమని, పరిస్థితులు అదుపులోకి వచ్చేంత వరకు తమను సురక్షిత ప్రాంతాలకు బదిలీ చేయమనడం అర్థవంతంగా ఉంది. హింసాత్మక వాతావరణంలో ప్రశాంతంగా పని చేయడం వీలుకానపుడు వారి ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంటుంది. హత్యానంతరం ప్రభుత్వాలు ప్రకటించే పరిహారాలు పోయిన ప్రాణాలను తీసుకురాలేవని, కాశ్మీరీ మైనారిటీ హిందువులు, సిక్కు కుటుంబాలకు రక్షణ గొడుగు పట్టాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాల మీద ఉందని సామాన్యులు ఆశిస్తున్నారు. లోయలోంచి ఉగ్రవాదుల్ని తరిమి, శాంతియుత వాతావరణాన్ని సత్వరమే నెలకొల్పే కఠిన చర్యలకు ప్రభుత్వాలు పూనుకోవాలి. మైనారిటీ హిందు బంధువుల మదిలో శాంతి స్థాపన చేయాలి.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037



స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకల సందర్భంగా తొర్రూరుకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకున్న సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలవేసి శాలువాతో సత్కరించిన తొర్రూరు మండల ఫీల్డ్ అసిస్టెంట్లు.అనంతరం వారు ముఖ్యమంత్రి కెసిఆర్, విధుల్లోకి తీసుకోవడానికి శ్రమించిన మంత్రి కి ఎల్లవేళల రుణపడి ఉంటామని తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో బి. సతీష్, యాకన్న , కృష్ణ, నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ అవయవ దాన వారోత్సవాలను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర గిరిజన, స్త్రీ-శిశు సంక్షేమ శాఖల మంత్రివర్యులు శ్రీమతి సత్యవతి రాథోడ్




మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నేత్ర అవయవశరీర ధాతల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన, రాష్ట్రవ్యాప్త "ప్రపంచ అవయవ దాన వారోత్సవాలను" తెలంగాణ రాష్ట్ర గిరిజన, స్త్రీ–శిశు సంక్షేమ శాఖల మంత్రివర్యులు శ్రీమతి సత్యవతి రాథోడ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూఅన్ని దానాల్లోకెల్లా అవయవ దానం అత్యున్నతమైన దని, మానవ జన్మకు మహా అవకాశమని, నేత్ర దానం తో అంధుల్లో వెలుగులు, అవయవదానంతో ఆరిపోయే ప్రాణాలకు ఆయుష్షును,

దేహ దానంతో భావి వైద్యుల పరిశోధనలకు ఉపయోగ పడవచ్చునని,ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ– శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. గురువారం రోజు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్త "ప్రపంచ అవయవదాన వారోత్సవాల" (ఆగష్టు 11 నుండి 16) ప్రారంభ కార్యక్రమాన్ని సంబంధిత పోస్టర్లు, కరపత్రాలను మంత్రి సత్యవతి రాథోడ్ ఆవిష్కరించి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో నేత్ర అవయవశరీర ధాతల సంఘం జిల్లా కన్వీనర్ పరకాల రవీందర్ రెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పరికిపండ్ల అశోక్, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, తాళ్లూరి హనుమ, కొమ్మినేని రవీందర్, ఉమారాణి, ఆల్టెక్ రమేష్, కొండ బత్తుల ఈశ్వర్, చిదిరాల శరత్, షేక్ అఫ్జల్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## నేవీ జవాన్లతో స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో పాల్గొన్న- సల్మాన్ ఖాన్

న్యూఢిల్లీ, ఆగష్టు 11: షూటింగ్ గ్యాప్ లో స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో పాల్గొన్నారు బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్. షూటింగ్ విరామాన్ని దేశ స్వాతంత్ర్య వజ్రోత్సవాలను జరుపుకునేందుకు కేటాయించారు. ప్రస్తుతం విశాఖలో ఓ సినిమా షూటింగ్‌లో ఉన్న సల్మాన్ ఖాన్.. విరామం ప్రకటించగానే నేవీ సిబ్బందితో గడిపారు. ఇండియన్ నేవీ తూర్పు కమాండ్ స్థావరమైన విశాఖపట్నంలోని నేవీ సిబ్బందితో కలిసి ఆడిపాడారు. దాదాపు ఐదారు గంటలు నౌకాదళ సిబ్బంది, వారి కుటుంబాలతో కలిసి ఎంజాయ్ చేశారు. నేవీ క్యాప్ ధరించిన సల్మాన్ ఖాన్.. త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని డ్యాన్సులు చేశారు.

పుష్ అప్‌లు చేస్తూ నేవీ జవాన్లను ఉత్సాహపరిచారు. వారిని కూడా చేయాలంటూ పోటీ పెట్టారు. అనంతరం అక్కడే కిచెన్‌లో వంట చేశారు. తనకు వంట చేయడం అంటే చాలా ఇష్టమని.. అంతే ఇష్టంగా కూడా తింటానంటూ చెప్తూ జవాన్లను నవ్వుల్లో ముంచెత్తారు. స్వాతంత్ర్య వజ్రోత్సవాల వేళ బిజీ నటుడు తమ వద్దకు వచ్చి టైమ్ కేటాయించి తమతో ఆడిపాడటం పట్ల నేవీ జవాన్లు, సిబ్బంది, వారి కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.ఇప్పుడు ఈ ఫొటోలు వైరల్ గా మారాయి.

# ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా టూరిజం సంబంధిత భాగస్వామ్యులకు నేషనల్ వార్ మెమోరియల్ సందర్శన, సైనిక అమరవీరుల బంధువులకు సన్మానం

న్యూఢిల్లీ, ఆగష్టు 11: పర్యాటక మంత్రిత్వ శాఖ ఈరోజు న్యూఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్‌లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ నిర్వహించింది, పర్యటక రంగానికి సంబంధించిన భాగస్వామ్యపక్షాలకు స్మారక సందర్శనను ఏర్పాటు చేసింది. పర్యాటక మంత్రిత్వ శాఖ ఏడు మంది అమరవీరుల బంధువులను సత్కరించింది. అతిథులను నేషనల్ వార్ మెమోరియల్‌కి గైడెడ్ టూర్‌కి తీసుకెళ్లారు. వీరు నేషనల్ వార్ మెమోరియల్‌లో ప్రతిరోజూ నిర్వహించే అమరవీరులకు 'దండ వేయడం' వేడుకను కూడా వీక్షించారు. ఈ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి సైనికులకు నివాళులు అర్పించాలని అమరవీరుడు సైనికుల బంధువులను ఆహ్వానించారు. సాయంత్రం సూర్యాస్తమయానికి ముందు బీటింగ్ ది రిట్రీట్ డ్రిల్‌తో ఈ కార్యక్రమం ముగిసింది. కేంద్ర టూరిజం మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అరవింద్ సింగ్, పర్యటన సందర్భంగా ట్రావెల్ ట్రేడ్, విద్యార్థులు, ఇన్‌క్రెడిబుల్ ఇండియా టూరిస్ట్ గైడ్, ట్రావెల్ బ్లాగర్లు/ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు మరియు వాటాదారుల నుండి 150 మందికి పైగా ఆగస్టు సమావేశానికి నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమానికి కల్నల్ ఆకాష్ ఖజాంచి మరియు అతని బృందం పాల్గొని నేషనల్ వార్ మెమోరియల్ మద్దతునిచ్చారు. శ్రీ అరవింద్ సింగ్ నేషనల్ వార్ మెమోరియల్ వద్ద జరిగిన రిట్రీట్ సెర్మనీకి హాజరయ్యారు. దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసి యుద్ధ సమయంలో విశిష్టమైన పరాక్రమాలను ప్రదర్శించిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరవింద్ సింగ్ మాట్లాడుతూ మనం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను జరుపుకుంటున్నాం ఈ అమృత్‌కాల్‌లో ప్రవేశించబోతున్నాం.. (భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు) అందరూ వచ్చి అమృత్‌కాల్ సందర్భంగా జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించి నివాళులర్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాను అన్నారు. దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన సైనికులకు. భారత దేశం యొక్క జాతీయ రాజధాని మధ్యలో 40 ఎకరాలలో విస్తరించి ఉంది, భారతదేశం కోసం నిర్భయంగా పోరాడి ప్రాణాలు కోల్పోయిన సైనికులందరికీ నివాళిగా నేషనల్ వార్ మెమోరియల్ ఉంది. ఫిబ్రవరి 25, 2019న ప్రారంభిం చబడిన ఈ స్మారక చిహ్నం అమర్ జవాన్ జ్యోతి యొక్క శాశ్వతమైన జ్వాల వెలుగులో ఒక జాతికి గర్వకారణంగా నిలుస్తుంది, మన దేశం తన సైనికులకు ఋణపడి ఉంది. పుల్వామా దాడిలో 40 మంది అమరవీరుల స్వస్థలం నుండి మట్టితో సహా భారతదేశం అంతటా 144 మంది ఆర్మీ అమరవీరుల స్వస్థలం నుండి మట్టిని కలిగి ఉన్న 144 మట్టి కుండలకు నివాళులర్పించడం ఈ కార్యక్రమంలో ఒక ముఖ్యాంశం. బెంగుళూరుకు చెందిన శ్రీ ఉమేష్ గోపీనాథ్ జాదవ్ రోడ్డు మార్గంలో 1.15 లక్షల కిలోమీటర్లకు పైగా ప్రయాణించారు. భారతదేశం అంతటా 144 మంది అమరవీరుల కుటుంబాలను కలుసుకున్నారు మరియు "భారత్ కి మిట్టి కా సమ్మాన్" యాత్రగా వారి ఇంటి వెలుపల మట్టిని సేకరించారు. నేషనల్ వార్ మెమోరియల్ అరేనాలో దేశం నుండి గౌరవానికి గుర్తుగా ఈ గౌరవనీయ మైన మట్టి కుండలు ఈవెంట్ సందర్భంగా ప్రదర్శించబడ్డాయి.

## సంగారెడ్డిలో ఫ్రీడమ్ రన్




సంగారెడ్డి, ఆగష్టు 11: (నేటినిజం ప్రతినిధి):మన భారత దేశ75 వ స్వాతంత్ర పక్షోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రీడం రన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య మహనీయుల వలన మనకు స్వాతంత్ర్యం వచ్చిందని, 75 సంవత్సరాలలో అడుగుపెట్టిన ఈ వజ్రోత్సవాలను ప్రతి ఒక్కరు స్వాగతించి తమ ఇళ్ల పైన జాతీయ జెండాలను కట్టుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఆగస్టు 8వ తేదీ నుండి 22వ తేదీ వరకు వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

## ఫ్రీడం పార్కును మొక్కలు ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్




సంగారెడ్డి, ఆగస్టు, 11(నేటి నిజం ప్రతినిధి): 75వ స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో జడ్పీ ఛైర్మన్ మంజూశ్రీ జైపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ ఫ్రీడం పార్కును ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ లు రాజశ్రీ షా, వీర రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అమృత మహోత్సవాల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా

న్యూఢిల్లీ, ఆగష్టు 11: 75 ఏళ్ల స్వాతంత్ర్య ఉత్సవాల్లో భాగంగా జరుపుకుంటున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా "హర్ ఘర్ తిరంగ అభియాన్" ప్రచారంలో భాగాం, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి శ్రీ కపిల్ మోరేశ్వర్ పాటిల్ పూణేలోని చారిత్రక స్మారక చిహ్నం ఆగా ఖాన్ ప్యాలెస్‌ను, డాక్టర్ మెహతాస్ నేచర్ క్యూర్ క్లినిక్ (ప్రస్తుత పేరు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి), ఆగస్ట్ 12న సందర్శించి జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. ఈ సందర్భంగా ఈ రెండు చారిత్రక ప్రదేశాల్లో స్వాతంత్ర్య సమర యోధులను, వారి కుటుంబా లను, అమరవీరుల కుటుంబాలను ఆయన సత్కరించి, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వీరులకు నివాళులర్పిస్తారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ (ఏకేఏఎం) వేడుకలో భాగంగా, హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం కోసం 11–15 ఆగష్టు 2022 వరకు వివిధ ప్రముఖులు స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన 400 ప్రదేశాలను సందర్శించాలని నిర్ణయించారు. పూణేలోని ఆగాఖాన్ ప్యాలెస్, డాక్టర్ మెహతాస్ నేచర్ క్యూర్ క్లినిక్ కూడా ఈ 400 చారిత్రక ప్రదేశాలలో సాంస్కృతిక మంత్రిత్వ శాఖచే నిర్ణయించబడ్డాయి. ఈ కార్యక్రమానికి 500 మందికి పైగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులు, శాసన సభ సభ్యులు, ఇతర స్థానిక నాయకులు, ప్రముఖులు హాజరుకానున్నారు.

పూణేలోని ఆగాఖాన్ ప్యాలెస్ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఒక ప్రధాన భూమిక పోషించింది. మహాత్మా గాంధీజీ, ఆయన సతీమణి శ్రీమతి కస్తూర్బా గాంధీజీ, సెక్రటరీ మహదేవ్‌భాయ్ దేశాయ్, అలాగే మీరాబెన్, ప్యారేలాల్ నాయర్, సరోజినీ నాయుడు మరియు డా. సుశీలా నాయర్‌లు ఇందులో 9 ఆగస్ట్ 1942 నుండి మే 6, 1944 ఖైదు చేయబడ్డారు. ఈ ప్రదేశంలోనే కస్తూర్బా గాంధీ మరియు మహదేవ్‌భాయ్ దేశాయ్ మరణించారు. ఈ ప్రదేశం గాంధీజీకి చాలా ప్రత్యేకమైనది. కస్తూర్బా గాంధీ మరియు మహదేవ్‌భాయ్‌ల సమధు'లు ప్రధాన ప్యాలెస్ వెనుక ఒక తోటలో ఉన్నాయి. ఇది ఇప్పుడు గాంధీ నేషనల్ మెమోరియల్ సొసైటీ యొక్క ప్రధాన కార్యాలయంగా పనిచేస్తుంది, ప్రస్తుతం ఇక్కడ 'ఖాదీ' వస్త్రాల తయారీ ప్రధాన కార్యకలాపంగా కొనసాగుతోంది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి (ఎన్ఐఎన్) మహారాష్ట్రలోని పూణేలో దివంగత డాక్టర్ దిన్షా కె. మెహతాచే "నేచర్ క్యూర్ క్లినిక్ మరియు సానిటోరియం"గా నిర్వహించబడే "బాపు భవన్" అనే చారిత్రక ప్రదేశంలో ఉంది.

## నాగార్జున సాగర్‌కు పోటెత్తిన వరద..26 గేట్లు ఎత్తివేత

అమరావతి, ఆగష్టు 11: శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు భారీ వరద కొనసాగుతున్నది. దీంతో అధికారులునాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్‌లోకి ఇన్ ఫ్లో : 4,38,446 క్యూసెక్కులు..ఔట్ ఫ్లో : 3,36,672 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం : 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటి మట్టం : 588.00 అడుగులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ: 312 టీఎంసీలకు గాను ప్రస్తుతం : 306.1010 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అయితే 2009 తర్వాత మళ్లీ 2022 లో 26 గేట్లు ఎత్తి నీటిని దిగువ వదిలినట్లు అధికారులు తెలిపారు.

ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు వరద భారీగా పెరుగుతున్నది. ప్రాజెక్టుకు 3,88,717 క్యూసెక్కుల వరద వస్తున్నది. జలాశయం ఇప్పటికే పూర్తిగా నిండటంతో అధికారులు 10 గేట్లు 12 అడుగుల మేర ఎత్తి 3,79,110 క్యూసెక్కుల వరద దిగువకు వెళ్తున్నది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు. ప్రస్తుతం 884.60 అడుగులు ఉన్నది. కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నది.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్.. మొక్కలు నాటిన సంగీత దర్శకుడు కళ్యాణ్ మాలిక్



హైదరాబాద్, ఆగష్టు 11: రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్‌ఇండియా ఛాలెంజ్ లో భాగంగా మ్యూజిక్ డైరెక్టర్ థమన్ విసిరిన ఛాలెంజ్ ను ప్రముఖ సంగీత దర్శకుడు కళ్యాణ్ మాలిక్ స్వీకరించి జూబ్లీహిల్స్ జీహెచ్ ఎంసీ పార్క్ లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాలిక్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ఎంపీ సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ చేపట్టడం గొప్ప నిర్ణయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటడం ఆనందంగా ఉందని, ప్రతి ఒక్కరు ఈ ఛాలెంజ్ స్వీకరించి మొక్కలు నాటాలని కోరారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగస్వామ్యం చేసినందుకు ఎంపీ సంతోష్ కుమార్ కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం సింగర్ చిన్మయి, లిరిక్ రైటర్ లక్ష్మీ భూపాల్, మ్యూజిక్ డైరెక్టర్ స్వర సాగర్ మహతి ముగ్గురికి గ్రీన్ ఇండియా ఛాలెంజ్ విసిరారు. కార్యక్రమ అనంతరం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో ఫౌండర్ రాఘవ వృక్షవేదం పుస్తకాన్ని కళ్యాణ్ మాలిక్ కి బహుకరించారు.

## భారత 49వ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన - శ్రీ జస్టిస్ ఉదయ్ ఉమేష్ లలిత్

న్యూఢిల్లీ, ఆగష్టు 11: భారత రాజ్యాంగంలోని 124 అధికరణంలోని క్లాజ్ (2) ద్వారా రాష్ట్రపతి తమకు సంక్రమించిన అధికారాన్ని ఉపయోగించి, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న శ్రీ జస్టిస్ ఉదయ్ ఉమేష్ లలిత్ ని భారత ప్రధాన న్యాయమూర్తి గా నియమించారు. భారత 49వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఉదయ్ ఉమేష్ లలిత్ 2022 ఆగష్టు, 27వ తేదీన బాధ్యతలు స్వీకరించనున్నారు.

జస్టిస్ ఉదయ్ ఉమేష్ లలిత్ 2014 ఆగష్టు, లో భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బార్ కౌన్సిల్ నుంచి నియమితులయ్యారు. 1971 లో 13వ సి.జె.ఐ. గా పనిచేసిన జస్టిస్ ఎస్.ఎం. సిక్రి తర్వాత బార్ కౌన్సిల్ నుండి నేరుగా సుప్రీంకోర్టుకు నియమితులైన రెండవ భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లలిత్ నిలిచారు. జస్టిస్ లలిత్ సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యునిగా కూడా రెండు పర్యాయాలు పనిచేశారు.

జస్టిస్ యు.యు. లలిత్ తమ సర్వీసులో అనేక కీలక తీర్పులు ఇచ్చారు. మహారాష్ట్రలోని షోలాపూర్‌లో 1957 నవంబర్, 9వ తేదీన జన్మించిన జస్టిస్ లలిత్, 1983 జూన్ లో మహారాష్ట్ర మరియు గోవా బార్ కౌన్సిల్ లో న్యాయవాదిగా తమ పేరు నమోదు చేసుకున్నారు. 1986 జనవరి లో ఢిల్లీ లో న్యాయవాద వృత్తి చేపట్టడానికి ముందు 1985 డిసెంబర్ వరకు బాంబే హైకోర్టు లో న్యాయవాదిగా పనిచేశారు.

1986 అక్టోబర్ నుండి 1992 వరకు శ్రీ సోలి జె. సోరాబ్జీ ఛాంబర్ లో జస్టిస్ లలిత్ పనిచేశారు. శ్రీ సోలి జె. సోరాబ్జీ భారతదేశానికి అటార్నీ జనరల్ గా ఉన్న కాలంలో యూనియన్ ఆఫ్ ఇండియా తరఫున న్యాయవాదుల బృందం లో జస్టిస్ లలిత్ కూడా ఉన్నారు. 1992 నుండి 2002 వరకు ఆయన "అడ్వకేట్–ఆన్–రికార్డ్" గా పనిచేశారు.

## సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి.. డిసిపి రూపేష్



కరీంనగర్ , ఆగష్టు 11: : (నేటినిజం ప్రతినిధి): సైబర్ నేరాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని పెద్దపల్లి డిసిపి రూపేష్ పిలుపునిచ్చారు. ఈరోజు పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని డీసెంట్ ఫంక్షన్ హాల్ లో సైబర్ అంబాసిడర్లతో నిర్వహించిన గ్రాండ్ ఫినాలే సమావేశంలో 11 నెలలుగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నుండి ఇద్దరికీ సైబర్ నేరాలపై పూర్తి స్థాయిలో శిక్షణ కల్పించామన్నారు. అంబాసిడర్లు విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులకు, ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి మాధవి, పెద్దపల్లి ఏసీపీ సారంగపాణి, సిఐలు ప్రదీప్ కుమార్, సతీష్, లక్ష్మీనారాయణ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## త్వరలో తొర్రూరులో భారీ జాతీయ పతాకం : మంత్రి ఎర్రబెల్లి



మహబూబాబాద్, ఆగష్టు 11: (నేటినిజం ప్రతినిధి): భారత జాతీయ ఉద్యమమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందని, ఆ ఉద్యమ స్ఫూర్తితోనే ప్రస్తుత సీఎం కేసీఆర్ ఆనాడు ఉద్యమ రథసారథిగా తెలంగాణను సాధించారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో మంత్రి ఫ్రీడం రన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొర్రూర్ లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు లో ఏర్పాటు చేసిన భారీ జాతీయ పతాకం తరహాలో తొర్రూరు జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేయనున్న భారీ జాతీయ పతాక కార్యక్రమానికి మంత్రి శంకుస్థాపన చేశారు.

అనంతరం మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ..పోరాడి సాధించిన తెలంగాణ తెర్లు కాకుండా అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలబడడానికి సీఎం కేసీఆర్ గాంధీజీ స్ఫూర్తితో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. దేశంలో 20 అత్యున్నత ఆదర్శ గ్రామాలను లెక్క తీస్తే అందులో 19 గ్రామాలు తెలంగాణవే రావడమే ఇందుకు నిదర్శనమని మంత్రి అన్నారు.

భారత స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్న లక్ష్యంతోనే స్వతంత్ర భారత వజ్రోత్సవాల కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలు ప్రత్యేకించి యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ

అమరావతి, ఆగష్టు 11: భారీ వర్షాల మధ్య ధవళేశ్వరం వద్ద గోదావరి నది ఉధ్ధృతంగా ప్రవహిస్తున్నది. ప్రస్తుతం బ్యారేజీ నీటిమట్టం 13.75 అడుగులకు చేరుకున్నది. దీంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుతం ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 13.19 లక్షల క్యూసెక్కులుగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి ఉపనదులు పొంగిపొర్లుతుండగా, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రాజమండ్రిలోని ఘాట్లను మూసివేశారు. మరోవైపు కేంద్ర అధికారుల బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నది. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పలు గ్రామాలను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేస్తున్నది.

గోదావరి ఉప నదులు పొంగిపొర్లి ప్రవహిస్తుండటంతో నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ అథారిటీ సూచించింది. ముంపు ప్రాంతాల్లో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు పూర్వ తూర్పు గోదావరి జిల్లాలో 3 ఎన్డీఆర్ఎఫ్ , 3 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, వీఆర్ పురంలో ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు.

గోదావరి నది ఉగ్రరూపం దాల్చడంతో చాలా లంక గ్రామాలు ముంపునకు గురయ్యాయి. పలు గ్రామాల ప్రజలు బ్రతుకు జీవుడా అంటూ పిల్లాపాపలతో లంకను వదిలి వెళ్లిపోతున్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పాశర్లపూడి-అప్పనపల్లి కాజ్‌వే నీట మునిగిపోయింది. ఫలితంగా నాలుగైదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సఖినేటిపల్లి మండలంలోని అప్పన్నరాముని లంక టేకీ శెట్టిపాలెం వంతెన నీట మునగడంతో రెండు గ్రామాల మధ్య వాహనాలు నడవడం లేదు. వరదల నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. సహాయం కోసం 89779 35609 నంబర్‌లో సంప్రదించాలని అధికారులు సూచించారు.

ఇలాఉండగా, గత నెలలో జరిగిన వరదల నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం ఇవాల బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించింది. వరదలకు దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన, గృహ నష్టాలను ఈ బృందం పరిశీలించింది. రాజమండ్రి నుంచి రోడ్డు మార్గాన రావులపాలెం మండలంలోని గోపాలపురం చేరుకున్న బృందం.. గోపాలపురంలో వ్యవసాయ పంట నష్టంపై ఫొటో ఎగ్జిబిషన్‌ను, దెబ్బతిన్న వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించింది. అక్కడి నుంచి పీ గన్నవరం, రాజోలు మండలంలో పర్యటించారు. దిడి రిసార్ట్‌లో విశ్రాంతి తీసుకున్న అనంతరం విజయవాడ బయల్దేరి వెళ్లింది. అక్కడ కేంద్ర బృందం సంబంధ అధికారులతో సమీక్ష నిర్వహించింది.

## శ్రీ పర్షోత్తం రూపాలా వంటలకు సంబంధించిన కాఫీ టేబుల్ పుస్తకం ‘ ఫిష్ అండ్ సీఫుడ్ - ఎ కలెక్షన్ అఫ్ 75 గౌర్మెట్ రెసిపీస్’

న్యూఢిల్లీ, ఆగష్టు 11: కేంద్ర ఫిషరీస్ పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీ పర్షోత్తమ్ రూపాలా ఈరోజు ఇక్కడ ‘ఫిష్ ఽ సీఫుడ్ –ఏ కలెక్షన్ ఆఫ్ 75 గౌర్మెట్ రెసిపీస్’ అనే పేరుతో ఒక ప్రత్యేకమైన కాఫీ టేబుల్ బుక్‌ను ప్రారంభించారు. చేపలు సముద్ర ఆహారాల దేశీయ వినియోగాన్ని పెంపొందించే ప్రయత్నం లో, స్థానిక చేప జాతుల ప్రాచుర్యం కల్పించడంతోపాటు, ఫిషరీస్, పశుసంవర్ధక పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మత్స్య శాఖ ఈ చొరవతో ముందుకు వచ్చింది. ఈ పుస్తకాన్ని కేంద్ర సహాయ మంత్రులు డాక్టర్ ఎల్. మురుగన్, డాక్టర్ సంజీవ్ కుమార్ బల్యాన్ ల సమక్షంలో ఆవిష్కరించారు; కార్యదర్శి –శ్రీ జతీంద్ర నాథ్ స్వైన్, జాయింట్ సెక్రటరీ(ఇన్లాండ్ ఫిషరీస్) –శ్రీ సాగర్ మెహ్రా; జాయింట్ సెక్రటరీ (మెరైన్ ఫిషరీస్)– శ్రీ జె బాలాజీ, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన శాఖ అధికారులు, ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ ఖఓఅ అధికారులు, ప్రత్యేక అతిథిగా ప్రముఖ చెఫ్ శ్రీ కునాల్ కపూర్ ఈ సందర్భంలో ఉన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ప్రచారం కింద భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 అద్భుతమైన సంవత్సరాల వేడుకలో కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం ఒక భాగం. వంటల పుస్తకం దేశీయ నీటి వనరులలో లభించే వివిధ చేపల దేశవ్యాప్తంగా ఉన్న విభిన్న వండే శైలులను సూచించే గొప్ప ప్రయత్నం. ఇది మనదేశ పాక వారసత్వ గరిమ.

కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమంలో, శ్రీ రూపాల భారతీయ ‘వంటలు’, వివిధ సాంప్రదాయ చేపల వంటల సంస్కృతి సారాంశ సమ్మేళనాన్ని సంగ్రహించే ఆసక్తికర రీతిలో రూపొందించిన పుస్తకాన్ని సూచించినందుకు శాఖను అభినందించారు. సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్, తన అభినందన ప్రసంగంలో పుస్తకంలోని తమిళనాడు వంటకాలు, నోరూరించే తీరప్రాంత చేపల వంటకాలను ప్రస్తావిస్తూ తనను టైమ్ ట్రావెల్ ద్వారా ఎలా వ్యామోహాన్ని కలిగించాయో పంచుకున్నారు. శ్రీ జతీంద్ర నాథ్ స్వైన్ తన సొంత రాష్ట్రం ఒడిశా వారి దైనందిన ఆహారంలో భాగంగా చేపలను ఎలా ఆస్వాదిస్తారనే దాని గురించి కూడా మాట్లాడారు. చిన్న చేతివృత్తిగా ఉన్న చేపల రైతుల జీవనోపాధిని ఆదుకోవడానికి శాఖ వివిధ రకాల ప్రయత్నాలు చేస్తోందని కూడా ఆయన ప్రస్తావించారు. తన ప్రత్యేక భారతీయ వంటకాలకై ప్రసిద్ధి చెందిన ప్రముఖ చెఫ్ కునాల్ కపూర్ కూడా చేపల పేర్లతో పాటు వివిధ ప్రాంతాల నుండి స్థానిక వంటకాలు కలిగి ఉన్న పుస్తక భావనను ప్రశంసించారు. ఈ సంఘటన తన చిన్ననాటి జ్ఞాపకాలు తన తండ్రి తన కుటుంబానికి చేప పిల్లలను ఎలా తెచ్చేవారో, తరువాత దేశంలోని వివిధ ప్రాంతాలలో వివిధ రకాల చేపల రకాలు దాని వైవిధ్యమైన వంట పద్ధతిని ఎలా పరిచయం చేశారో పేర్కొన్నారు.

పురాతన కాలం నుండి భారతీయ ఆహారంలో చేపలు, సముద్ర ఉత్పత్తుల ఆహారం ముఖ్యమైన భాగం. సింధు లోయ నాగరికతలో చేపల వినియోగాన్ని ముఖ్యమైన ఆహార అంశంగా సూచించడానికి అనేక అవశేషాలు కనుగొనబడ్డాయి. చేపలు దాని పోషక విలువలను పరిగణనలోకి తీసుకుంటే భారతీయ ఆహార విధానాలలో అంతర్భాగంగా మారింది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఈఁయా) అంచనాల ప్రకారం, 2030 నాటికి భారతదేశ చేపల ఉత్పత్తిలో దాదాపు మూడింట రెండు వంతులకి ఆక్వాకల్చర్ బాధ్యత వహిస్తుంది. ఇది ఉపాధికి మత్స్య ఉత్పాదన సంస్కృతి ముఖ్యమైనదని, అలాగే చేపలు ఆహారంగా కీలక వనరు అని సూచిస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు పోషకాహార భద్రత కు ఇవే ఆలంబన.

మత్స్య రంగ ప్రాముఖ్యతను గుర్తించి, సమగ్ర, వ్యూహాత్మక కేంద్రీకృత జోక్యాలను తీసుకోవడానికి, భారత ప్రభుత్వం తన ప్రధాన పథకం ప్రధాన్ మంత్రి మత్స్య సంపద యోజన (ఖఓటూజ)ని మే 2020లో ఆత్మనిర్భర్ భారత్ ప్యాకేజీలో భాగంగా అత్యధిక పెట్టుబడితో రూ. . 20,050 కోట్లు తీసుకువచ్చింది. అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో ఆర్థిక సంవత్సరం 2020–21 నుంచి2024–25 వరకు ఐదు సంవత్సరాల వ్యవధిలో ఈ పథకం అమలు అవుతుంది. ఈ పథకం మత్స్యరంగ స్థిరమైన బాధ్యతాయుతమైన అభివృద్ధిని కొనసాగించడానికి, మత్స్యకారులు, చేపల పెంపకందారులు విలువ-గొలుసులోని అన్ని ఇతర భాగస్వాముల సామాజిక-ఆర్థిక అభివృద్ధికి భరోసా ఇస్తుంది. పిఎంఎంఎస్‌వై చేపల ఉత్పత్తి ఉత్పాదకత, నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానం కలయిక, ఎంపిక, అనంతర మౌలిక సదుపాయాలు నిర్వహణలో ఉన్న క్లిష్టమైన అంతరాలను పరిష్కరించడానికి ఈ రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తుంది. ప్రైవేట్ రంగంలో మత్స్య వ్యాపార అభివృద్ధి, ఆవిష్కరణ,వ్యవస్థాపకత, సులభంగా వ్యాపారం చేయడం ఇతర అవసరమైన మద్దతును పెంపొందించడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం మత్స్యశాఖ లక్ష్యం.కాఫీ టేబుల్ బుక్ ద్వారా, మత్స్యశాఖ, దేశీయ చేపల వినియోగాన్ని పెంచడం ఆహారం, పోషకాహార భద్రత కోసం చేపల ప్రొటీన్‌లను ప్రోత్సహించడంతోపాటు, భారతీయ చేపల పాక వారసత్వం స్థానిక వంటకాల వైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి కూడా ఉద్దేశించింది.

పిఎంఎంఎస్‌వై పథకం ద్వారా దేశీయ చేపల వినియోగాన్ని తలసరి 5 కిలోల నుండి 12 కిలోలకు పెంచడానికి తమ శాఖ వివిధ వ్యూహాత్మక కార్యక్రమాలు చేపడుతున్నదని జాయింట్ సెక్రటరీ (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్) శ్రీ మెహ్రా పేర్కొన్నారు, ఎగుమతులను రెండింతలు రూ. 1 లక్ష కోట్లు ఉత్పాదకతను హెక్టారుకు 3 టన్నుల నుండి 5 టన్నులకు పెంచడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. వారు తన ప్రసంగంలో ప్రతి ఒక్కరినీ వారి ఆహారంలో చేపలను తప్పనిసరి చేసుకోమని ప్రేరేపించారు, ఎందుకంటే ఇది పుష్కలంగా లభించే ప్రోటీన్ మూలం. ఆవిష్కరించిన పుస్తకంలో ఉన్న వంటకాలను వండే క్రమంలో వంటలప్రయోగాలు చేయమని ప్రతి ఒక్కరినీ శ్రీ మెహ్రా ప్రోత్సహించారు.

## ప్రజా వ్యతిరేక కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు చరమ గీతం పాడాలి

**-రైతు రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం**
**-కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే ఏక కాలంలో 2లక్షల రుణమాఫి చేస్తాం**
**-పేదలకు ఇస్తానని హామీ ఏమైంది కెసిఆర్ గారు**
**-గడిచిన 8యేండ్ల పాలనలో 44సార్లు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన బిజెపి ప్రభుత్వం**
**-ఆజాదీ కా గౌరవ్ పాదయాత్ర మూడవ రోజు వేంకటా పూర్ నుండి జవహర్ నగర్,లింగా పూర్ కు చేరిన సీతక్క మహా యాత్ర**



ములుగు , ఆగష్టు 11: (నేటినిజం ప్రతినిధి): ఈ రోజు ఎఐసిసి, టిపిసిసి పిలుపు మేరకు క్విట్ ఇండియా స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యములో కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి ములుగు ఎమ్మెల్యే సీతక్క గారి పాదయాత్ర వేంకటా పూర్ నుండి జవహర్ నగర్, లింగా పూర్ గ్రామానికి సాగిన పాదయాత్ర

ఈ సందర్బంగా మాట్లాడుతూఈ ఎనిమిది ఏండ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి సామాన్యుడు బ్రతకలేని స్థాయికి తీసుకొచ్చారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను, ఆర్.టి.సి. చార్జీలను పెంచి సామాన్యుడిని ఇంకా అథః పాతాళానికి తొక్కేలా చేసిందని అన్నారు. నిర్దిష్ట ప్రణాళిక లేని పథకాలతో, ఆర్థిక స్థితిగతులను అంచనా వేయలేక తెలంగాణ రాష్ట్రం తీవ్ర అప్పుల్లోకి కూరుకుపోయింది అని అన్నారు. దేశంలో కానీ రాష్ట్రంలో కానీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసి యువత భవిష్యత్తుని అంధకారంలోకి నెడుతున్నాయని అన్నారు. ఇంతవరకు ములుగు జిల్లాకు మంజూరు అయిన గిరిజన యూనివర్సిటీ, మెడికల్ కాలేజ్ వెంటనే ప్రారంభించాలని, అలాగే ములుగుకి బస్ డిపో కట్టించాలని, వరదల వలన నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని, ములుగు నియోజకవర్గ అభివృద్ధి కొరకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సీఎం కేసీఆర్ ఇస్తానని చెప్పిన నిరుద్యోగ భృతి, ఏకకాలంలో లక్ష రూపాయల పంట రుణమాఫీ, పోడు భూములకు పట్టాలు, రెండు పడకల గదులు, ఇంటికో ఉద్యోగం, కేజీ టూ పీజీ ఉచిత విద్య, ప్రతీ మండలంలో 100 పడకల ఆసుపత్రులు, గిరిజన మరియు మైనారిటీలకు 12% రిజర్వేషన్లు పెంపు లాంటి పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇకనైనా మేలుకొండి ప్రజలారా అధికార పార్టీలు ఒకరికి ఒకరు కుమ్మక్కు అయి దోచుకువడానికి ఒకటి దోచుకున్నది దాచుకోవడానికి ఇంకొక పార్టీ అన్నట్లు పాలన చేస్తున్నారు తప్ప ప్రజల కొరకు వారు పరిపాలన చేయట్లేదని ఇప్పటికి అయిన ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, పేదలకు ఇండ్లు ఇచ్చినా, పోడు భూములకు పట్టాలు ఇచ్చిన, పనికి ఆహార భద్రత కల్పించిన, వ్యవసాయం కోసం ఉచిత విద్యుత్ ఇచ్చిన, సబ్సిడీ ఎరువులు మరియు విత్తనాలు ఇచ్చిన, పంట రుణమాఫీ చేసిన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించిన విద్యార్థుల పై చదువుల కొరకు ఫీజ్- రీయింబర్సుమెంట్ ఇచ్చిన అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని సీతక్క అన్నారు

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నల్లెల కుమారస్వామి, టిపిసిసి అధికార ప్రతినిధి రవళి రెడ్డి, పైడాకుల అశోక్,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్ల పెల్లి రాజేందర్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లాడి రాం రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవి చందర్,మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండీ అయుబ్ ఖాన్,జెడ్పీటీసీ నామా కరం చంద్ గాంధీ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బై రెడ్డి బాగ్ వాన్ రెడ్డి, ఇరుస వడ్ల వెంకన్న

మండల అధ్యక్షులు చెన్నోజు సూర్య నారాయణ, ఎండీ చాంద్ పాషా,ఎండీ అఫ్సర్ పాషా,చిట మాట రఘు వర్కింగ్ కమిటీ అధ్యక్షులు బండి శ్రీనివాస్, రసుపుత్ సీతారాం నాయక్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు మామిడి శెట్టి కోటి,తో పాటు వేంకటా పూర్,జవహర్ నగర్ లింగా పూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీజిల్లా,మండల,గ్రామ,అనుబంధ సంఘాల అధ్యక్షులు జిల్లా సీనియర్ నాయకులు సర్పంచ్, ఎంపీటీసీ,సహకార సంఘం చైర్మన్ లు తదితరులు పాల్గొన్నారు

## స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకే స్వతంత్ర భారత వజ్రోత్సవాలు: పోలీస్ కమిషనర్



ఖమ్మం, ఆగష్టు 11: (నేటినిజం ప్రతినిధి): స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకే స్వతంత్ర భారత వజ్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ అన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2022 నాటికి 75 ఏళ్లు పూర్తికానున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య భారత జాతీయ వజ్రోత్సవ ఉత్సవాల్లో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం 2కె ఫ్రీడం రన్ గురువారం నిర్వహించారు. సర్దార్ పటేల్ స్టేడియం వద్ద పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్, జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్ క్రీడాజ్యోతి వెలిగించి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేల మంది పాల్గొన్న ఈ రన్?ను... రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ సారధ్యంలో స్పోర్ట్స్ అథారిటీ, అధికార యంత్రాంగం చేపట్టిన ఈ కార్యక్రమం పటేల్ స్టేడియం నుండి లకారం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఆనాటి మహనీయులు నిరంతరం పోరాట ఫలితంగానే స్వాతంత్రం సిద్దించిందన్నారు.

ఆ స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకే స్వతంత్ర భారత వజ్రోత్సవాలను అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించాదన్నారు.అనేక మంది మహనీయులు ప్రాణాలను ఫణంగా పెట్టి స్వాతంత్రం తీసుకువచ్చిన తీరును భావితరాలను తెలియజేప్పేలా 15 రోజుల పాటు వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వజ్రోత్సవాల్లో పాఠశాల విద్యార్థులు మొదలుకొని ఉద్యోగులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, యువతీయువకులు ఇలా యావత్ ప్రజానీకం దేశభక్తిని పెంపొందించేలా పరుగుపందెం పాలుపంచుకోవడం సంతోషకరమని పెర్కొన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, అదనపు కలెక్టర్లు మొగిలి స్నేహలత, అడిషనల్ డీసీపీ శబరిష్, ఎన్. మధుసూదన్, మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, డిఆర్వో శిరీష, డీఆర్డీవో విద్యాచందన,జిల్లా స్పోర్ట్ అధికారి వరందమరెడ్డి, ఏసీపీలు అంజనేయులు, రామోజీ రమేష్, ప్రసన్న కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సీఎం జగన్ కి రాఖీలు కట్టిన మహిళా మంత్రులు..బ్రహ్మకుమారీలు



అమరావతి, ఆగష్టు 11: మహిళా మంత్రులు సీఎం జగన్ కి రాఖీలు కట్టారు. అనంతరం వారు స్వీట్స్ ని జగన్ కి తినిపించారు.కాగా జగన్ కి రాఖీలు కట్టిన వారిలో మంత్రులు తానేటి వనిత, విడదల రజనితో పాటు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి ఉన్నారు. ఏపీ సీఎం జగన్‌కు బ్రహ్మకుమారీలు కూడా వచ్చి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలకు సీఎం జగన్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ట్విట్టర్ ద్వారా ‘రాష్ట్రంలోని ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు.. ప్రతి ఒక్క పాపకు, ప్రతి ఒక్క మహిళకు రాఖీ శుభాకాంక్షలు’ తెలిపారు. జగన్ కి మంత్రులు..బ్రహ్మకుమారీలు రాఖీ కట్టినట్లు కూయాప్ ద్వారా ఆంధ్రప్రదేశ్ సీఎంవో అధికారులు వెల్లడించారు.ఈ మేరకు జగన్ కి రాఖీ కడుతున్న ఫొటోని పోస్ట్ చేశారు.

## ఎస్వీ వేద వర్సిటీలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ సదస్సు



తిరుపతి, ఆగష్టు 11: శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ సదస్సు జరిగింది. యూనివర్సిటీ ఉపకులపతి, టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఆదేశాల మేరకు కులసచివులు డాక్టర్ ఏవీ రాధేశ్యామ్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యంబిడే, డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ నీలకంఠం, గంజాం రామకృష్ణ, డాక్టర్ కే పురుషోత్తమాచార్యులు, డాక్టర్ ప్రవా రామకృష్ణ సోమయాజి తదితరులు వివిధ అంశాలపై ఉపన్యసించారు.

ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సాహిత్య విభాగం ఆచార్యులు డాక్టర్ చక్రవర్తి రంగనాథ్ ఆర్ష వాంజ్ఞయంలో రాష్ట్ర భావన అనే అంశంపై ఉపన్యసించారు. జాతీయ నాయకులైన మహాత్మాగాంధీ, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వంటి వారు శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని పాలన అందించారని తెలిపారు. అలాంటి నాయకులను అమృతోత్సవాల సమయంలో స్మరించుకోవడం మన ధర్మమని చెప్పారు. స్వామి వివేకానంద వంటి మహనీయులు వేదాలను ఆధారంగా తీసుకొని దేశ ప్రతిష్టను ఇనుమడించేలా ప్రసంగాలు చేశారని, వారి మార్గంలో నేటి యువత నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ ఫణియజ్ఞేశ్వరయాజులు, పీఆర్వో డాక్టర్ టీ బ్రహ్మాచార్యులు తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## పశు సంతతికి పెద్ద ఊరట కల్పిస్తూ, వాటికి సోకే లంపీ చర్మవ్యాధికి దేశీయ వాక్సిన్‌ను ఆవిష్కరించిన కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ తోమర్.

న్యూఢిల్లీ, ఆగష్టు 11: దేశంలోని పశుసంతతికి పెద్ద ఊరట కలిగిస్తూ కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ ,పశువులకు సంక్రమించే లంపీ చర్మవ్యాధి బారి నుంచి వాటిని రక్షించడానికి దేశీయంగా రూపొందించిన లంపీ ప్రో వాక్ ఇండ్‌ను ఈ రోజు ఆవిష్కరించారు. ఈ వాక్సిన్ ను ఇజ్జత్ నగర్, బరెలి లోని ఇండియన్ వెటనరీ రిసెర్చ్ ఇన్ స్టిట్యూట్ తో కలసి హర్యానాలోని హిస్సార్ లో గల నేషనల్ ఎక్వైన్ రిసెర్చ్ సెంటర్ తయారు చేసింది. లంపీ చర్మవ్యాధిని రూపుమాపడంలో ఈ వాక్సిన్ మైలురాయిగా నిలుస్తుందని మంత్రి అన్నారు. మానవ వనరులతోపాటు పశుసంతతి భారతదేశ అతి పెద్ద ఆస్తి అని అంటూ దీనిని కాపాడుకుని సుసంపన్నం కావలసిన బాధ్యత మనపై ఉందని ఆయన అన్నారు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్ (ఐసిఎఆర్) ద్వారా వాక్సిన్ ను అభివృద్ధి చేయడం ద్వారా మరో కొత్త కోణం ఆవిష్కృతమైనట్టు తోమర్ తెలిపారు. ఎక్వైన్ రిసెర్చ్ సెంటర్ , వెటనరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లకు చెందిన శాస్త్రవేత్తలు లంపీ చర్మవ్యాధికి వాక్సిన్ రూపొందించడం పట్ల వారికి తోమర్ అభినందనలు తెలిపారు. స్వల్ప వ్యవధిలో పరిమిత ట్రయల్స్‌తో నూరుశాతం సమర్ధతతో అన్ని ప్రమాణాలకు అనుగుణంగా లంపీ చర్మవ్యాధికి వాక్సిన్‌ను రూపొందించడాన్ని శాస్త్రవేత్తలు సవాలుగా స్వీకరించడం తనకు సంతోషం కలిగించిందని అన్నారు.

ఈ వాక్సిన్ ను పెద్దమొత్తంలో తయారు చేసి పశువులను లంపీ చర్మవ్యాధినుంచి విముక్తి చేయాల్సిందిగా సంబంధిత అధికారులను శ్రీ తోమర్ ఆదేశించారు. దేశంలో 30 కోట్ల పశు సంతతి ఉందని , మూగజీవాల బాధను అర్థం చేసుకుని వాటికి ఉపశమనం కలిగించేందుకు అవసరమైన అన్ని చర్యలు సత్వరం తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

గతంలో కూడా ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ నాయకత్వంలో మన శాస్త్రవేత్తు కరోనానుండి ప్రజలను రక్షించేందుకు వాక్సిన్ ను రూపొందించారని, ఇది మన దేశం మొత్తానికే కాక,ఇతర దేశాలకు ఎంతో ప్రయోజనం కలిగించిందని అన్నారు.

మత్స్య, పశుగణాభివృద్ధి, పాడిపరిశ్రమ శాఖమంత్రి శ్రీ పురుషోత్తమ్ రూపాల , కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి శ్రీ కైలాస్ చౌదరి, మత్స్య, పశుగణాభివృద్ధి, పాడిపరిశ్రమ శాఖ కార్యదర్శి శ్రీ జతీంద్రనాథ్ స్వెయిన్, ఐసిఎఆర్ డైరక్టర్ జనరల్ డాక్టర్ హిమాంశు పాఠక్, డిప్యూటి డైరక్టర్ జనరల్ డాక్టర్ బి.ఎన్. త్రిపాఠి, ఇండియన్ వెటనరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరక్టర్ డాక్టర్ త్రివేణి దత్, నేషనల్ ఎక్వైన్ రిసెర్చ్ సెంటర్, డైరక్టర్ డాక్టర్ యష్‌పాల్ , ఇతర సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కడప జిల్లాలో రూ.200 కోట్లు పెట్టుబడి పెట్టనున్న ఏజీఅండ్ పీ ప్రథమ్

అమరావతి, ఆగష్టు 11: ప్రముఖ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ అయిన ఏజీ అండ్ పీ ప్రథమ్, గ్యాస్ డిస్ట్రిబ్యూషన్‌న్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయడానికి వచ్చే ఐదేళ్లలో కడప జిల్లాలో రూ.200 కోట్లు పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉంది. ఈ పెట్టుబడులు జిల్లాలో 500 మందికి పైగా ప్రజలకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని కూడా అందిస్తాయి.

ఈ సందర్భంగా ఏజీఅండ్ పీ ప్రథమ్ కడప జిల్లా ప్రాంతీయాధిపతి గుమాలపల్లి వెంకటేష్ మాట్లాడుతూ.. కడపను స్వచ్ఛమైన జిల్లా చేయడానికి ఏజీ అండ్ పీ ప్రథమ్ కృషిచేస్తోందన్నారు. ఇందుకోసం చవకయినా సహజవాయువును సులభంగా అందిస్తోందన్నారు. దీంతో ఈ జిల్లా ప్రజలు తమ జీవితాలను మరింత సుఖంగా గడపగలరన్నారు. ప్లాంట్, పైప్‌లైన్ నిర్మాణానికి సహకరించిన జిల్లా అధికారులకు ప్రత్యేకముగా ధన్యవాదములు తెలుపుచున్నామన్నారు. ఒఅఔఉ స్టేషన్ ఏర్పాటు అనేక డిమాండ్ కేంద్రాలకు గ్యాస్ సరఫరా చేయడానికి ఉద్దేశించబడింది, పెట్రోలియం ఽ సహజ వాయువు నియంత్రణ మండలి (ఖఔఉఖీః) ద్వారా పేర్కొన్న సహజ వాయువు పైప్‌లైన్‌ల భద్రతా ప్రమాణాలతో సహా అన్ని సాంకేతిక ప్రమాణాలు, స్పెసిఫికేషన్‌లను అనుసరిస్తుందన్నారు.

## బిగ్‌చేంజ్.. ఐటీ చెల్లిస్తే అక్టోబర్ నుంచి అనర్హులే!

న్యూఢిల్లీ, ఆగష్టు 11: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక పెన్షన్ స్కీం.. అటల్ పెన్షన్ యోజన (ఏపీవై). ఈ పథకంలో పలు నిబంధనల్లో మార్పులు రానున్నాయి. ఆదాయం పన్ను (ఐటీ) చెల్లిస్తున్న వారు అక్టోబర్ ఒకటో తేదీ నుంచి 'ఏపీవై' స్కీమ్‌లో చేరడానికి అనర్హులని పేర్కొంటూ కేంద్ర ఆర్థికశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా 2015లో మోదీ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. అసంఘటిత రంగంలో పని చేస్తూ రిటైరైన వారికి ఫైనాన్సియల్ కవరేజీ కల్పించే పథకం ఇది. ఒకవేళ అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఈ పథకంలో చేరిన సబ్‌స్క్రైబర్.. పన్ను చెల్లింపుదారుడైతే అతడి ఏపీవై ఖాతా మూసేసి, పెన్షన్‌ను ఆ వ్యక్తికి తిరిగి చెలి60 ఏండ్ల వయస్సు దాటిన వారికి ప్రతి నెలా రూ.1000 నుంచి రూ.5000 వరకు అటల్ పెన్షన్ యోజన కింద ఫించన్ లభిస్తుంది. 18-40 ఏండ్ల మధ్య వయస్కులు ఈ పథకంలో పెట్టుబడి పెట్టొచ్చు. కనీసం 20 ఏండ్లు పెట్టుబడి పెట్టడం తప్పనిసరి. రూ.1000 నుంచి రూ.5000 పెన్షన్ పొందాలంటే సబ్‌స్క్రైబర్ ప్రతి నెలా రూ.42 నుంచి రూ.210 వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏండ్ల నుంచి సబ్‌స్క్రైబర్లుగా చేరిన వారికి ఈ ప్రీమియం వర్తిస్తుంది.

40 ఏండ్లు దాటిన వ్యక్తి ప్రీమియం ఇలా

40 ఏండ్ల వయస్సు గల వ్యక్తి సబ్‌స్క్రైబర్ అయితే ప్రతి నెలా రూ.291-1,451 చెల్లించాల్సి ఉంటుంది. సబ్‌స్క్రైబర్ అధిక ప్రీమియం చెల్లిస్తే, రిటైర్‌మెంట్ తర్వాత అధిక పెన్షన్ పొందుతారు. సబ్‌స్క్రైబర్ మరణిస్తే, వారి జీవిత భాగస్వామికి, ఇద్దరూ మరణిస్తే నామినీకి 60 ఏండ్ల వయస్సు వచ్చే వరకు పెన్షన్ చెల్లిస్తారు. 60 ఏండ్ల లోపు సబ్‌స్క్రైబర్ మరణిస్తే.. మిగతా కాలం ఆ జీవిత భాగస్వామి కంట్రిబ్యూషన్ చేస్తుందాలి.

కనీస పెన్షన్ హామీ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకం చేపట్టింది. సబ్‌స్క్రైబర్లు నెలవారీ, త్రైమాసికానికోసారి, ఆరు నెలలకోసారి చెల్లించొచ్చు. ప్రీమియం కంట్రిబ్యూషన్ కోసం ఆటో-డెబిట్ ఆప్షన్ ఎంచుకుంటే మీ సేవింగ్స్ ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా మీ పెన్షన్ ఖాతాలోని ప్రీమియం క్రెడిట్ అవుతుంది.

ఆన్‌లైన్‌లోనూ ఈ పథకంలో లబ్ధిదారులుగా చేరొచ్చు. ఇప్పటికే నాలుగు కోట్ల మందికి పైగా ఖాతాదారులు చేరారు. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) తెలిపిన గణాంకాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరం (2021-22)లో 99 లక్షలకు పైగా ఖాతాలు ప్రారంభమయ్యాయి.

నేషనలైజ్డ్ బ్యాంకుల్లో ఏపీవై ఖాతా తెరవొచ్చు

అన్ని నేషనలైజ్డ్ బ్యాంకులు ఏపీవై స్కీమ్‌ను ఆఫర్ చేస్తున్నాయి. భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్బీఐ)లో అటల్ పెన్షన్ స్కీం తెరవచ్చు. ఏదేనీ బ్యాంక్ శాఖకు వెళ్లి ఏపీవై ఖాతా ప్రారంభించొచ్చు. అవసరమైన పత్రాలతో అటల్ పెన్షన్ యోజన ఫామ్ నింపి సంబంధిత బ్యాంకు శాఖలో సబ్‌మిట్ చేయాల్సి ఉంటుంది. అప్లికేషన్ అప్రూవ్ అయితే, మీకు కన్ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది.

సేవింగ్స్ ఖాతా లేకుండానే అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) పథకంలో చేరొచ్చు. తొలి ఇన్వెస్ట్‌మెంట్ తేదీని బట్టి నెలవారీ కంట్రిబ్యూషన్ తేదీ ఖరారవుతుంది. ఈ పథకంలో మీతోపాటు నామినీ పేరు తప్పనిసరిగా చేర్చాల్సిందే. ప్రతి ఒక్కరూ ఒకే ఒక్క అటల్ పెన్షన్ యోజన ఖాతాను మాత్రమే తెరువడానికి అనుమతి ఇస్తారు. నెలవారీ కంట్రిబ్యూషన్‌కు అవసరమైన సొమ్ము మీ సేవింగ్స్ ఖాతాలో లేకుంటే పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది.

## జర్నలిస్టులకు అండగా నిలిచిన ఎంపీ విజయసాయిరెడ్డి.. టీయూడబ్ల్యుజే ఢిల్లీ కమిటీకి పది లక్షల విరాళం



న్యూఢిల్లీ, ఆగష్టు 11: ఢిల్లీలో పని చేస్తున్న జర్నలిస్టులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని వైఎస్సార్సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయుడబ్ల్యుజే) ఢిల్లీ కమిటీ సభ్యులను న్యూఢిల్లీలోని తన నివాసానికి ఆహ్వానించారు. అధ్యక్షుడు నాగిళ్ల వెంకటేష్ నేతృత్వంలో కమిటీ సభ్యులు ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజయసాయి జర్నలిస్టులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల రద్దు చేసిన రైల్వే పాసుల వ్యవహారాన్ని జర్నలిస్టులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై వచ్చే శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని విజయసాయి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమానికి ఆయన పది లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. అనంతరం విజయసాయి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు సేవలందిస్తున్న జర్నలిస్టులకు అనేక సమస్యలున్నాయని, వాటి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రాజ్యసభ ప్యానెల్ వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైనందున కమిటీ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛమిచ్చి, శాలువా కప్పి సన్మానించారు. కరోనా ఆపత్కాలంలోనూ తమకు అండగా నిలిచిన విజయసాయిరెడ్డికి అందరూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యుజే రాష్ట్ర సహాయ కార్యదర్శి అవ్వారి భాస్కర్, ఉపాధ్యక్షురాలు స్వరూప పొట్లపల్లి, కార్యదర్శులు రాజు, జబ్బార్ నాయక్‌తో పాటు సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, ఆచార్య శరత్ చంద్ర, గోపీకృష్ణ, అశోక్‌రెడ్డి, నాగరాజు, ప్రభు, లింగారెడ్డి, కామరాజు, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాజ్యసభ అధికారులను కలుసుకొని వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపిన శ్రీ నాయుడు

న్యూఢిల్లీ, ఆగష్టు 11: ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ శ్రీ ఎం. వెంకయ్య నాయుడు ఈరోజు పార్లమెంట్ హౌస్‌లో రాజ్యసభ సెక్రటేరియట్ అధికారులతో సమావేశమయ్యారు. గత ఐదేళ్లుగా వారు అందించిన ప్రేమ, మద్దతుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. వారి అంకితభావాన్ని మరియు కర్తవ్య భావాన్ని అభినందిస్తూ శ్రీ నాయుడు వారి భవిష్యత్తుకు మంచి జరగాలని ఆకాంక్షించారు. "మీరు ఎల్లప్పుడూ నా హృదయానికి దగ్గరగా ఉంటారు" అని ఆయన రాజ్యసభ ఉద్యోగులతో అన్నారు. రాజ్యసభకు చెందిన సీనియర్ అధికారులు శ్రీ నాయుడుతో తాము గడిపిన రోజులను గుర్తుచేసుకుని, సంవత్సరాలుగా ఆయన మార్గదర్శకత్వం మరియు నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపినప్పుడు సన్నివేశం చాలా ఉద్వేగభరితంగా మారింది. పదవీవిరమణ చేసిన ఛైర్మన్‌కు వారు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. దీనికి ముందు, ఉపరాష్ట్రపతి పార్లమెంట్ హౌస్ ఉద్యానవరం వద్ద సీతా అశోక మొక్కను నాటారు. మన సహజ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. భారతీయ సంప్రదాయంలో ఒక చెట్టును ఎందరో కొడుకులతో సమానంగా పరిగణిస్తారని, దేశవ్యాప్తంగా చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు.

# గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణలో అభివృద్ధి సంక్షేమం... రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు





మహబూబాబాద్, ఆగష్టు 11: (నేటినిజం ప్రతినిధి): తొర్రూరు మండలం:భారత జాతీయ ఉద్యమమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందని, ఆ ఉద్యమ స్పూర్తితోనే ప్రస్తుత సీఎం కేసీఆర్ ఆనాడు ఉద్యమ రథసారథిగా తెలంగాణను సాధించారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చే పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు లో మంత్రి ఫ్రీడం రన్ లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొర్రూర్ లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు అక్కడ నుంచి ఫ్రీడం రన్ ని మంత్రి ప్రారంభించి తాను కూడా జిల్లా పరిషత్ పాఠశాల వరకు ఆ ఫ్రీడం రన్ లో పాల్గొన్నారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు లో ఏర్పాటు చేసిన భారీ జాతీయ పతాకం తరహాలో తొర్రూరు జెడ్పి పాఠశాలలో ఏర్పాటు చేయనున్న భారీ జాతీయ పతాక కార్యక్రమానికి మంత్రి శంకుస్థాపన చేశారు. స్వాతంత్ర్యానికి ప్రత్యేకగా గాల్లోకి బెలూన్లను వదిలారు.అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతు తెలంగాణ ఉద్యమానికి భారత జాతీయ ఉద్యమమే ప్రేరణ. ఆనాటి ఆ ఉద్యమ స్పూర్తితోనే నాటి తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారు. సాధించిన తెలంగాణ తెర్లు కాకుండా అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలబడడానికి అవసరమైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గాంధీజీ స్పూర్తితోనే అమలు చేస్తున్నారు. అని మంత్రి అన్నారు.గాంధీజీ ఆశయాలకు అనుగుణంగానే గ్రామీణ భారతంలోనే దేశ అభివృద్ధి ఉందని భావించి, నేటి యువత నాటి స్వాతంత్ర ఉద్యమ స్పూర్తిని అలాగే తెలంగాణ ఉద్యమ స్పూర్తిని కూడా ఆదర్శంగా తీసుకోవాలని శాంతియుత ప్రజాస్వామ్యత పద్ధతుల్లోనే దేన్నైనా సాధించవచ్చునని ఆ రెండు ఉద్యమాలు ప్రజలకు చాటి చెప్పాయని మంత్రి అన్నారు. తెలంగాణ గాంధీజీగా పేరున్న సీఎం కేసీఆర్ ఆలోచన విధానాన్ని, ఆచరణను ఆదర్శంగా తీసుకొని నేటి యువత భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డేవిడ్,తొర్రూర్ ఆర్డీవో రమేష్, తొర్రూర్ డి.ఎస్.పి రఘు,సి ఐ సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య,మున్సిపల్ కమిషనర్ గుండె బాబు, ఎమ్మార్వో రాఘవరెడ్డి, ఎస్ఐ లు సతీష్,రాజు , తెరాస మండల పార్టీ అధ్యక్షులు సీతా రాములు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జినుగు సురేందర్ రెడ్డి , కౌన్సిలర్లు,స్వచ్ఛంద సేవా సంస్థలు,అంగన్వాడీ టీచర్లు, ఎఎన్ఎంలు,ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు,పోలీస్ సిబ్బంది, యువకులు, రెవెన్యూ అధికారులు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు,విద్యార్థిని విద్యార్థులు,ప్రజలు, నాయకులు మరియు మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# స్వాతంత్ర్య ఫలాలు ప్రతిఒక్కరికి అందాలి: స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



బాన్సువాడ, ఆగష్టు 11: స్వాతంత్ర్య ఫలాలు ప్రతిఒక్కరికి అందాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దేశంలో పేదరికం అంతరించిపోవాలని, ప్రజలంతా సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. వజ్రోత్సవాల సందర్భంగా దేశ, రాష్ట్ర ప్రజలు, రైతులు, మహిళలు, పేదల కోసం మనమందరం పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా బాన్సువాడ పట్టణంలో నిర్వహించిన ఫ్రీడమ్ రన్‌లో శాసన సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫ్రీడమ్ రన్‌లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, చిన్నారులు, పోలీసులకు స్వతంత్ర భారత వజ్రోత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. పిల్లల మధ్య స్వాతంత్ర్య ఉత్సవాలు జరుపుకోవడం గొప్ప అవకాశమని చెప్పారు.

నేటి తరం పిల్లలకు స్వాతంత్ర్యం అంటే ఏమిటనే విషయంపై అవగాహన ఉండాలని సూచించారు. ఆంగ్లేయుల పాలనలో దేశం, ప్రజలు బానిసలుగా బతికారని, వారి నుంచి స్వేచ్ఛ కోసం మహాత్మాగాంధీ వంటి స్వాతంత్ర్య సమరయోధులు అనేకమంది పోరాటం చేసి 2 వందల ఏండ్ల పరాయి పాలన నుంచి మనకు విముక్తి కల్పించారని చెప్పారు. నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య ఫలాలు వారి త్యాగఫలమని వెల్లడించారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వజ్రోత్సవ ఉత్సవాలను ఈ నెల 22 వరకు ఘనంగా నిర్వహిస్తున్నదని తెలిపారు.

# భారత వజ్రోత్సవాలు తెలంగాణాలో అద్భుతమైన పండగ వాతావరణంలో జరుపుకొంటున్నాం

## -మెదక్‌లో విజయవంతంగా ఫ్రీడమ్‌రన్... ఫ్రీడమ్‌రన్‌ను ప్రారంభించిన కలెక్టర్



మెదక్, ఆగష్టు 11: నేటినిజం ప్రతినిధి):ఫ్రీడమ్‌రన్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరీశ్, జిల్లా అధికారులు, యువకులుతెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స్వతంత్ర భారత వజ్రోత్సవాలను అద్భుతమైన పండగ వాతావరణంలో జరుపుకొంటున్నామని ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన విజయవంతంగా ప్రతి రోజూ కార్యక్రమాలు జరుగుతున్నాయని మెదక్ జిల్లా కలెక్టర్ హరీశ్ అన్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో ఫ్రీడమ్ ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ నుంచి ప్రారంభమైన ర్యాలీని జిల్లా కలెక్టర్ హరీశ్ జెండా ఊపి ప్రారంభించగా ర్యాలీ స్థానిక రాందాస్ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం రాందాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ... 75వ స్వతంత్ర దినోత్సవాలైన వజ్రోత్సవాలను తెలంగాణలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఎంతో అద్భుతంగా పండగ వాతావరణంలో జరుపుకొంటున్నామని అన్నారు. భారతదేశంలో ఎంతో గర్వించదగిన పండగ జరుపుకొంటున్నామని ఈ వజ్రోత్సవాలను ఎందుకు జరుపుకొంటున్నామనే విషయాలు అందరికీ తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వతంత్ర భారత స్పూర్తిని వివరించాలన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలైందని... స్వాతంత్ర్యం కోసం ఎందరో దేశభక్తులు పోరాటం చేశారని దీనిని ఎవరూ మరిచిపోరాదని కలెక్టర్ పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుల గురించి ముఖ్యంగా విద్యార్థులు, యువకులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం, సీఎం సూచించిన మేరకు ఈనెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పదిహేను రోజుల పాటు రోజుకో కార్యక్రమం చొప్పున నిర్వహించడం జరుగుతుందని... ఈ మేరకు పాఠశాల విద్యార్థులు థియేటర్లలో ప్రదర్శించబడుతున్న గాంధీ చిత్రాన్ని తప్పకుండా వీక్షించాలన్నారు. అలాగే శనివారం నిర్వహించనున్న ఫ్రీడమ్ ర్యాలీలో యువకులు, పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. దీంతో పాటు ఈనెల 16న నిర్వహించే సామూహిక గీతాలాపనకు సంబంధించి పాఠశాలల్లో బడి బెల్స్ మోసే సమయంలో... మెదక్ పట్టణ వ్యాప్తంగా ఆయా చోట్ల సైరన్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అవి మోగగానే ఉదయం 11.30 గంటలకు ప్రతి ఒక్కరూ ఎక్కడ ఉన్నా నిశ్శబ్దం పాటిస్తూ జాతీయ గీతాలాపన చేయాలని.. జాతీయ జెండాను గౌరవించేలా ఉండాలని కలెక్టర్ హరీశ్ తెలిపారు. ఈ విషయంలో మెదక్ మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, వైస్ ఛైర్మన్లు అవసరమైన చోట్ల మైక్‌లలు, సైరన్స్, జాతీయ గీతాలాపన వినిపించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే 18వ తేదీ వరకు ఫ్రీడమ్ కప్ నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఫ్రీడమ్ రన్‌లో 75 మీటర్ల పొడవుతో ఉన్న జాతీయ పతాకాన్ని విద్యార్థులతో ప్రదర్శింపచేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు కలెక్టర్లు రమేష్, ప్రతిమాసింగ్, అదనపు ఎస్పీ బాలస్వామి, జడ్పీ సీఈవో వెంకట శైలేష్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, డీపీవో తరుణ్‌కుమార్, డీఈవో రమేష్ కుమార్, జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఏవో పరశురామ్‌నాయక్, డీఎస్పీ సైదులు, మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, వైస్ ఛైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, పట్టణంలోని యువకులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దానకర్ణుడే ఆశ్చర్యపడేలా సహాయం,50 లక్షల సొంత ఖర్చులతో ఆలయ రహదారి విస్తరణ

**- జీళ్ళచెర్వు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ రహదారి విస్తీర్ణానికి ఎమ్మెల్యే కందాళ సొంత ఖర్చులతో 50 లక్షల రూపాయల వితరణ**



ఖమ్మం, ఆగష్టు 11: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్ళచెర్వు గ్రామంలో చిన్న తిరుపతిగా పేరుగాంచి ఈ ప్రాంత భక్తులకు ఆరాధ్య దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన రహదారి భక్తుల రాకపోకలకు కలుగుతున్న ఇబ్బందులను గమనించిన పాలేరు ప్రజల ఆపద్బాంధవుడు శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి భక్తుల సౌకర్యార్థం కొరకు రహదారి విస్తీర్ణానికి పునుకొని, తన సొంత ఖర్చులతో సుమారు 50 లక్షల రూపాయల వ్యయంతో రహదారి నిర్మించుటకు సిద్ధపడి, గురువారం పాలేరు శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి సతీమణి విజయమ్మ చే శంకుస్థాపన కార్యక్రమానికి నిర్వహించారు.

అనంతరం ఆ గ్రామంలో స్వతంత్ర భారత వజ్రోత్సవ ద్వీసప్తాహం కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలను ఇంటింటికి పంచి, జెండాలను ఇంటి పైన ఎగరవేయాలని తెలియజేశారు.

## కల్యాణమస్తు కార్యక్రమం తాత్కాలికంగా రద్దు-టిటిడి ఈవో ధర్మారెడ్డి

తిరుమల, ఆగష్టు 11: కల్యాణమస్తూ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామని..త్వరలోనే మరో ముహూర్తంను నిర్ణయించి కళ్యాణమస్తూ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు.స్థానిక అన్నమయ్య భవన్ లో టీటీడీ ఈవో ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాశీ,అయోధ్యలలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి స్థలం ఇవ్వాలని ప్రభుత్వాని కోరామని..

స్థలం కేటాయిస్తే శ్రీవాణి ట్రస్టు నిధులతో ఆలయాలు నిర్మిస్తామన్నారు.ఈ నెల 21వ తేదీన నేవీ ముంబాయిలో 8.30 నిమిషాల నుంచి 9.50 గంటల మధ్య శ్రీవారి ఆలయ నిర్మాణానికి శంఖుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని?భూమి పూజ కార్యక్రమాన్నికీ మహారాష్ట్ర సీఎం,ఉప ముఖ్యమంత్రి హాజరవుతారన్నారు.ఆజాదికి అమృతోత్సవంలో భాగంగా ప్రతి టీటీడీ ఉద్యోగి ఇంటి పై జాతీయ జండాను ఎగుర వేయ్యాలని ఆదేశాలు జారీ చేశామని?ప్రతి ఉద్యోగి జాతీయ జండాను ధరించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు.

ఆగష్టు 15వ తేదీన ఉద్యోగులతో తిరుపతిలో గాంధీ విగ్రహం వద్దకు ర్యాలీని నిర్వహిస్తామని టీటీడీ విద్యాలయాలు, యూనివర్సిటీ, అనుబంధ సంస్థలు,ఆస్పత్రులల్లో వున్న వారు కూడా అజాదికా అమృతోత్సవం వేడుకల్లో పాల్గొనాలని ఆదేశాలు ఇచ్చామన్నారు.భక్తుల సౌకర్యార్థం తిరుమలలోని అన్ని గదుల్లో గీజర్లు ఏర్పాటు చేస్తామన్నారు.గోవింద రాజ స్వామి ఆలయంలోని అర్చకులు,గదుల వద్ద..క్యూ కాంప్లెక్స్ లలో భక్తుల నుంచి సిబ్బంది డబ్బులు వసూలు చెయ్యడాని తీవ్రంగా పరిగణిస్తున్నా మని..విచారణ జరిపి వీరి పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.తిరుమలలో వసతి సౌకర్యం పెంచే అవకాశం లేదని..తిరుమలలో వసతి కొరత దృష్ట్యా?భక్తులు తిరుపతిలోనే బస చేసి శ్రీవారి దర్శనానికి రావాలని విజ్ఞప్తి చేశారు.

జూలై నెలలో శ్రీవారికి రికార్డు స్థాయిలో రూ 139.33 కోట్లు హుండీ ఆదాయం లభించిందని..23.40 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారన్నారు. 1.07 కోట్ల శ్రీవారి లడ్డూలను విక్రయించామని..53.41 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారన్నారు. 10.97 లక్షల మంది భక్తులు స్వామి వారికీ తలనీలాలు సమర్పించారన్నారు.

## వరదల్లో కొట్టుకుపోయిన ఏటీఎం-నీటి పాలయిన రూ.24లక్షలు



న్యూఢిల్లీ, ఆగష్టు 11: వరదల్లో ఏటీఎం కొట్టుకుపోయింది. ఈ ఏటీఎంలో రూ.24లక్షల నగదు ఉంది.కాగా ఈ సంఘటన ఉత్తరాఖండ్ ఉత్తరకాశీ జిల్లాలో చోటు చేసుకుంది. కుమోలో నది వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తోంది. పురోలాలో నది ఒడ్డున 8 దుకాణాలు, ఏటీఏం వున్నాయి. వరదల కారణంగా అవన్నీ కొట్టుకుపోయాయి. ఏటీఎంలో రూ. 24 లక్షల నగదు కూడా వున్నట్లుగా తెలుస్తోంది. బుధవారం సాయంత్రమే ఇందులో నగదును డిపాజిట్ చేశారు అధికారులు. బుధవారం రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి కుమోలో నదిలో ప్రవాహం పెరిగి వరదలకు దారి తీసింది. వరద ఉధృతి కొనసాగుతూ వుండటంతో సమీపంలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు.

## యూనివర్సల్ పోస్టల్ యూనియన్ రాజ్యాంగానికి ప్రతిపాదించిన 11వ అదనపు సవరణలకు ఆమోదం

న్యూఢిల్లీ, ఆగష్టు 11: యూనివర్సల్ పోస్టల్ యూనియన్ రాజ్యాంగానికి ప్రతిపాదించిన 11వ అదనపు సవరణలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. 2021 ఆగస్టు 9-27 వరకు అబిద్జాన్ (కోట్ డి ఐవోయిర్)లో జరిగిన యూనివర్సల్ పోస్టల్ యూనియన్ 27వ మహాసభ ఆమోదించి సంతకాలు చేసిన విధంగా సవరణలు జరిగాయి. కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన తీర్మానం మేరకు రాష్ట్రపతి సంతకం చేసిన "ఇన్‌స్ట్రుమెంట్ ఆఫ్ ర్యాటిఫికేషన్"ను కేంద్ర తపాలా శాఖ కలిగి ఉంటుంది. దీనిని యూనివర్సల్ పోస్టల్ యూనియన్ కు చెందిన ఇంటర్నేషనల్ బ్యూరో లో పోస్టల్ శాఖ డిపాజిట్ చేస్తుంది. రాజ్యాంగానికి ప్రతిపాదించిన సవరణలను సభ్య దేశాలు సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని యూనివర్సల్ పోస్టల్ యూనియన్ రాజ్యాంగంలోని 25 మరియు 30 అధికారణాలో పొందుపరిచిన నిబంధనలను భారతదేశం గౌరవించినట్లు అవుతుంది. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం వల్ల యూనివర్సల్ పోస్టల్ యూనియన్ 27వ మహాసభలు ఆమోదించిన రాజ్యాంగ సవరణలు యూనియన్ చట్టాలకు మరింత చట్టపరమైన స్పష్టత మరియు స్థిరత్వాన్ని నిర్ధారిస్తాయి.

# ఫ్రీడం రన్ కు భారీ స్పందన




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 11: (నేటినిజం ప్రతినిధి): స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా గురువారం నాంపల్లి ఘాట్ రోడ్ నుండి సంకెపల్లి అర్ అండ్ అర్ కాలనీ వరకు నిర్వహించిన ఫ్రీడం రన్ కార్యక్రమం ను అర్బన్ ఎంపీపీ బుర్ర వజ్రమ్మ బాబు , జడ్పీటీసీ మ్యాకల రవి , వేములవాడ పోలీసులు ,అధికారులు ప్రజాప్రతినిధులు ప్రారంభించారు జెండాలను చేత బూని.. బోలో స్వతంత్ర భారత్ కీ జై..అంటూ నినాదాలు చేస్తూ ఫ్రీడమ్ రన్ ను విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా ఎంపీపీ జెడ్పీటీసీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధన కోసం ఎందరో మహానుభావులు నేలకొరిగారని ఆ మహనీయులను స్వాతంత్ర్య సమరయోధులను గుర్తుచేసుకుంటూ ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీధర్, ఎస్సై వెంకట రాజం, సర్పంచులు, ఎంపిటిసి లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు,గ్రామపంచాయతీ ఉద్యోగులు,గ్రామ ప్రజలు,హెల్త్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు,మహిళ సంఘాలు,,గ్రామ స్థాయి అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్యం అంటే ఒక్కరోజు చేసుకునే వేడుక కాదు: మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, ఆగష్టు 11: స్వాతంత్ర్యం అంటే ఒక్క రోజు చేసుకునే వేడుక కాదని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఎలాంటి పాత్రలేని వారు, బ్రిటిష్ పాలకులకు తొత్తులుగా వ్యవహరించిన వారు నేడు ఈ దేశానికి ప్రభువులుగా ఉన్నారని విమర్శించారు. స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా వనపర్తిలో నిర్వహించిన ఫ్రీడమ్ రన్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేశారు, భగత్ సింగ్ ఉరికంబానికి సిద్ధమయ్యారు.. ఇలా దేశంలో ఒక్కోచోట ఒక్కోవిధంగా ప్రజలను స్వాతంత్ర్య సంగ్రామం వైపు కదిలించారని చెప్పారు. ఎవరు ఏ దారిని ఎంచుకున్నప్పటికీ అందరి లక్ష్యం భారతమాత సంకెళ్లను తెంచడంకోసమేనని వెల్లడించారు. ఆ రోజు మన పెద్దలు స్వాతంత్ర్యం కోసం పోరాడకపోయి ఉంటే మన పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలన్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలోని బృందం భారత రాజ్యాంగాన్ని రచించారని, దానిప్రకారమే దేశంలో పాలన, న్యాయ, శాసన వ్యవస్థలతో పాటు అన్ని వ్యవస్థలు నడుస్తున్నాయని చెప్పారు. ఏది చేసినా రాజ్యాంగానికి విఘాతం కలగకుండా ముందుకుసాగాలని సూచించారు.

స్వాతంత్ర్యం విలువ, దానికోసం చేసిన త్యాగాలు ఈ తరానికి, భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ మొక్కుబడిగా కాకుండా 15 రోజులపాటు విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ



నెల 8 నుంచి 22 వరకు వజ్రోత్సవ వేడుకలను జరుపుతున్నామని వెల్లడించారు.

# అత్యధికంగా మొదటి త్రైమాసంలో 4,895 కోట్ల రూపాయలను పంపిణీచేసిన సుందరం ఫైనాన్స్



హైదరాబాద్, ఆగష్టు 11: 2022 ఆర్థిక సంవత్సర మొదటి త్రైమాసంతో పోలిస్తే 138% వృద్ధి ; స్థూల లాభం 2023 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసంలో 18% వృద్ధి చెంది 226 కోట్ల రూపాయలుగా నిలిచింది.గ్రాస్ గ్రోత్ స్టేజ్ 3 ఎస్సెట్స్ తో ఎస్సెట్ నాణ్యత గణనీయంగా మెరుగుపడింది (జూన్ 30,2021 నాటికి 4.25%గా ఉంది) నెట్ స్టేజ్ 3 ఎస్సెట్స్ 1.30%గా ఉన్నాయి (జూన్ 30,2021 నాటికి 3.12%)2022 ఆర్థిక సంవత్సర నాల్గవ త్రైమాసంతో పోలిస్తే 2023 ఆర్థిక సంవత్సర మొదటి త్రైమాసంలో డిస్బర్స్మెంట్స్ 31% వృద్ధి చెందాయి. 2022 ఆర్థిక సంవత్సర మొదటి త్రైమాసంలో నిర్వహణలోని ఆస్తులు 2.4% పెరిగి 30,552 కోట్ల రూపాయలకు చేరాయి.ఆర్ఓఏ 2.5%గా ఉంది (2021 ఆర్థిక సంవత్సర మొదటి త్రైమాసంలో 2.2%గా ఉంది) క్యాపిటల్ ఎడెక్వసీ రేషియో 24.1%గా ఉంది (2021 ఆర్థిక సంవత్సర మొదటి త్రైమాసంలో 23.5%గా ఉంది)చెన్నై, ఆగష్టు 09,2022: సుందరం ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఆడిట్ చేయబడని, స్టాండలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాలను జూన్ 30, 2022 తో ముగిసిన త్రైమాసానికి ఆమోదించారు. మహమ్మారి ముందు నాటి వృద్ధి పథంలో తాము పయణిస్తూ అత్యధికంగా మొదటి త్రైమాసంలో 4,895 కోట్ల రూపాయలను పంపిణీ చేశాము. తద్వారా గత సంవత్సరపు మొదటి త్రైమాసంతో పోలిస్తే 138% వృద్ధి నమోదు చేశాము. ఆస్తుల నాణ్యత స్థాయి పరంగా గణనీయంగా వృద్ధి చేయడంతో పాటుగా లాభాల స్వీకరణ ఆరోగ్యవంతంగా 18% వృద్ధి నమోదు చేశాము. నాణ్యత మరియు లాభదాయకతతో అత్యంత శక్తివంతమైన వృద్ధి నమోదు చేశాము. మొత్తంమ్మీద ఆర్థిక కార్యకలాపాలు కొనసాగుతుండటం చేత ద్రవ్యోల్బణ ఆందోళనలు ఉన్నప్పటికీ అన్ని విభాగాలలోనూ వృద్ధి కనిపిస్తుంది" అని హర్ష విజి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ అన్నారు."చాలా వరకూ ఆస్తి తరగతులలో మేము తగిన వాటా పొందగలిగాము. వాణిజ్య వాహన విభాగంలో రికవరీ జరుగుతుందని మేము ఆశిస్తున్నాము. మరీ ముఖ్యంగా భారీ , మీడియం వాహనాల పరంగా ఇది కనిపించనుంది. సుందరం టీమ్ ఇప్పుడు పలు విభాగాలలో తగిన వాటా పొందేందుకు శ్రమిస్తుంది" అని రాజీవ్ లోచన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నారు.

# దేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని కొనసాగిద్దాం

## -రాజన్న ఆలయ ఈవో రమాదేవి.



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 11: (నేటినిజం ప్రతినిధి): దేశ స్వతంత్ర్య స్ఫూర్తిని కొనసాగిద్దామని అందుకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యత నిర్వర్తించాలని రాజన్న ఆలయ ఈఓ రమాదేవి అన్నారు

(75) సంవత్సరాల స్వాతంత్ర వేడుకలను పురస్కరించుకొని, రాష్ట్రవ్యాప్తంగా జరుపుకుంటున్న స్వాతంత్ర భారత వజ్రోత్సవాల్లో× భాగంగా దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం వేములవాడ రాజన్న ఆలయ ప్రాంగణం నుండి సంస్కృత విద్యాసంస్థల విద్యార్థిని విద్యార్థులతో నగరసంకీర్తన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ఈఓమాట్లాడుతూస్వాతంత్రోద్యమంలో ఎందరోమహానుభావులు కష్ట,నష్టాలకు ఓర్చి వారి విలువైనజీవితాలను త్యాగం చేసిన మహనీయులను స్మరిస్తూ, స్వతంత్ర ఉద్యమాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరి పైన ఉందని, ఈ నగర సంకీర్తన దేశభక్తిని చాటి చెప్పడానికి, దేశ సమైక్యతను దశదిశల వ్యాపింప చేయడానికి, మన స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను కీర్తించుకొనడానికి ఉద్దేశించబడినది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏ ఈ ఓ ప్రతాప నవీన్,బి ,శ్రీనివాస్, పర్యవేక్షకులు బి.తిరుపతి రావు సంస్కృత విద్యాసంస్థల ఇంచార్జి ప్రిన్సిపల్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తిని నేటి తరానికి అందించాలి: మంత్రి సత్యవతి



మహబూబాబాద్, ఆగష్టు 11: (నేటినిజం ప్రతినిధి): స్వాతంత్ర్య స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన గురుతరమైన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకల్లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 2కే ఫ్రీడమ్ రన్‌ను ఎంపీ కవితతో కలిసి మంత్రి సత్యవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంతోమంది మహనీయుల వీరోచిత పోరాటం, వారి త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని చెప్పారు. మహాత్ముడు అహింసా మార్గంలో స్వాతంత్ర్య పోరాటాన్ని సాగించారని తెలిపారు. గాంధీజీ ఉద్యమ స్ఫూర్తిని వర్తమానానికి, భావితరాలకు అందించాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పని వెల్లడించారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లయినప్పటికీ ఇంకా కొన్ని ప్రాంతాల్లో వివక్ష, వెనుకబాటుతనం ఉందని మంత్రి అన్నారు. దాన్ని రూపుమాపాలనే గొప్ప సంకల్పంతో సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. స్వరాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు, ప్రతి ఒక్కరి ముఖంలో చిరునవ్వు ఉండాలనేది ముఖ్యమంత్రి ఆకాంక్ష అని చెప్పారు. 75 సంవత్సరాలలో దేశంలో ఏ రాష్ట్రం సాధించని విజయాలను ఎనిమిదేళ్లలో తెలంగాణ సాధించి చూపిందని వెల్లడించారు.

# హైదరాబాద్‌లో 'కర్ణాటక టూరిజం రోడ్ షో'




హైదరాబాద్, ఆగష్టు 11: తెలంగాణ నుండి టురిజం కోసం వచ్చేవారిని పెంచే లక్ష్యంతో, కర్ణాటకలోని పర్యాటక ప్రదేశాలు, హోటళు ,, రిసార్ట్‌లు, హోమ్‌స్టేలు మరియు సర్వీస్ ప్రొవైడర్లను ప్రమోట్ చేయడానికి కర్ణాటక ప్రభుత్వ పర్యాటక శాఖ, కర్ణాటక రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఖూఆఅ)తో కలిసి ఇక్కడ రోడ్‌షో నిర్వహించింది.కర్ణాటక ప్రసిద్ధి చెందిన శక్తివంతమైన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించడానికి కర్ణాటకలోని పురాతన కళారూపమైన 'పూజ కుణిత' ప్రదర్శన నిర్వహించబడింది. ఈ రోడ్‌షో కర్ణాటక టూరిజంలోని ప్రకృతి, వన్యప్రాణులు, సాహసం, తీర్థయాత్ర, వారసత్వం మరియు మరెన్నో విభిన్న అంశాలను ఒకచోట చేర్చింది."కర్ణాటకలో ఏడాది పొడవునా పర్యాటక కేంద్రం; యునెస్కో వారసత్వ ప్రదేశాలు, వర్జిన్ బీచ్‌లు మరియు వన్యప్రాణుల టూరిజంకు కర్ణాటక ప్రత్యేకతను సంతరించుకుంది" అని టి. వెంకటేష్, డైరెక్టర్, కర్ణాటక టూరిజం అన్నారు




# 3వ రోజుకు చేరిన అజాది కా గౌరవ్ పాదయాత్ర.

## - పెద్దాపూర్ నుండి సంగారెడ్డి పోతి రెడ్డి పల్లి వరకు పాదయాత్ర చేసిన ఎమ్మెల్యే జగ్గారెడ్డి.



సంగారెడ్డి ఆగష్టు 11 ( నేటి నిజం ప్రతినిధి) అజాది కా గౌరవ్ పాదయాత్ర 3 వ రోజున సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి పెద్దాపూర్ నుండి సంగారెడ్డి పోతి రెడ్డి పల్లి వరకు తన పాదయాత్రను కొనసాగించారు. ఈ పాదయాత్రలో కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం నాడు పోతి రెడ్డి పల్లి వరకూ కొనసాగిన పాదయాత్ర ఆనంతరం ఎమ్మెల్యే జగ్గారెడ్డి మీడియా తో మాట్లాడుతూ శాంతి మార్గాన్ని చూపెట్టిన వ్యక్తి మహాత్మగాంధీ అని ప్రపంచ దేశాలు సైతం గాంధీ మార్గంలో నడుస్తున్నాయని అన్నారు. స్వతంత్ర వచ్చేసమయనికి మనకు ఎన్నికలు, ఎలెక్షన్ కమిషన్ లేకున్నా నెహ్రూ గారు సైతం శాంతియుతంగా మహాత్మ గాంధీ మార్గంలో నడిచేవారని ఆయన అన్నారు .

దేశంలో అభివృద్ధి జరగాలంటే గ్రామం,పట్టణం అభివృద్ధి జరగాలని నమ్మిన వ్యక్తులు గాంధీ ,నెహ్రూలని వివరించారు. అత్యవసరమైన కరెంట్, నీళ్లు ప్రజలకు అందించి అనేక పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి కల్పించిన మహానుభావులని కొనియాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా అనేక కార్యక్రమాలు చేపట్టి వ్యవసాయాన్ని అభివృద్ధి చేశారని ఆయన తెలిపారు .ఆహారధాన్యాలను నిల్వ ఉంచేలా నెహ్రూగారు అప్పుడే ఎఫ్ సీ ఐ ని తీసుకొచ్చి భవిష్యత్తులో ఆహార కొరత రాకుండా చర్యలు చేపట్టిన ఘనత వారిదేనన్నారు. ఇందిరగాంధీ గారు బ్యాంకు లను జాతీయం చేశారు, రాజీవ్ గాంధీ గారు టెక్నాలజీ అభివృద్ధి చేశారని చెప్పారు .స్వతంత్ర వచ్చాక 50 ఏళ్లకు పైగా కాంగ్రెస్సే పరిపాలించింది. ఈ 70 ఏళ్లలో కాంగ్రెస్ దేశ ప్రజల కోసం అనేక వసతులు,ఉపాధి,నీళ్లు, కరెంట్, రోడ్లు ,విద్య, వైద్యం ఇలా అన్నీ విభాగాల్లో అభివృద్ధి చేసిందని గుర్తుచేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు, సాగు భూములను ఇచ్చి వారిని ఆదుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వ్యాఖ్యానించారు. నిన్న మొన్న పుట్టిన వాళ్ళు కాంగ్రెస్ ఏంచేసిందని మాట్లాడటం అవివేకం అన్నారు. కేసీఆర్,కేటీఆర్,హరీష్ రావు, బండి సంజయ్ 70 ఏళ్లలో కాంగ్రెస్ చేసిందేమీ లేదని అనటం వారి అవివేకమన్నరు. ఇంత పెద్ద దేశంలో డెమోక్రసీ ని, ఎన్నో వ్యవస్థలను తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీయే అని గుర్తుచేశారు. ఈ రోజు చిన్న చిన్న టెక్నికల్ ప్రాబ్లమ్స్ చూపెట్టి సోనియా, రాహుల్ గాంధీ ల పై ఈడీ కేసులు పెడుతుంది బీజేపీ ప్రభుత్వమని విమర్శించారు. ఆ రోజు మోతిలాల్ నెహ్రూ, నెహ్రూ గారు దేశ స్వతంత్ర కోసం వారి ఆస్తులను త్యాగం చేసిన చరిత్ర వారి కుటుంబానిదేనని అన్నారు. స్వతంత్ర ఉద్యమ సమయంలో మోడీ,అమిత్ షా, కేసీఆర్,కేటీఆర్,హరీష్ రావు,బండి సంజయ్ ఎవరు పుట్టలేదు కదా. తెలంగాణ రాష్ట్రం కావాలి అంటే సోనియమ్మ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని ఏమ్మెల్లే జగ్గారెడ్డి గుర్తుచేశారు. ఇచ్చిన రాష్ట్రంలో మీరే హీరోలు అయ్యారు అయిన కూడా ఇంత చేసిన ఇంకా కాంగ్రెస్ ఎం చేసిందని మాట్లాడటం మంచిది కాదని అన్నారు. బండి సంజయ్ కి రాజకీయాల్లో తూ తెలీదు తా తెలీదని ఎగ్దేవచేసారు. ఇంత నీచమైన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మోడీ పుట్టింది 1952 లో..స్వతంత్ర వచ్చింది 1947 లో అంటే స్వతంత్ర వచ్చాక మోడీ పుట్టి ఆ ఫలాలను అనుభవిస్తున్నాడు కధా అని దుయ్యబట్టారు. నైతికంగా సోనియా గాంధీ,రాహుల్ గాంధీ కుటుంబని విమర్శించే హక్కు బీజేపీ నాయకులకు ఎవరికి లేదని హెచ్చరించారు. ఈ రోజు అజాది కా గౌరవ్ పాదయాత్ర ప్రజలకు స్వతంత్ర ఎలా వచ్చింది అని ఆ త్యాగాలు చేసిన వారిని గుర్తు చేయడానికి చేస్తున్నామని ఆయన వివరిచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, సంగారెడ్డి టౌన్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, తదితరులు ఈ పాదయాత్రను పాల్గొన్నారు.

# అత్యుత్తమంగా సేవించేందుకు ఆల్కోబేవ్ పరిశ్రమను సమూలంగా మారుస్తోన్న ప్రీమియం ఔట్‌లెట్లుఇప్సోస్




హైదరాబాద్, ఆగష్టు 11: ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఎస్‌డబ్ల్యుఏఐ) ఇటీవలనే అంతర్జాతీయ పరిశోధనా ఏజెన్సీ ఇప్సోస్ చేత ఓ మార్కెట్ అధ్యయనం చేయించింది. దీనిద్వారా ఉన్నత శ్రేణి , ప్రీమియం మద్యం దుకాణాలలో కొనుగోలుదారుల అనుభవాలు, వారి కోరికలను తెలుసుకునే ప్రయత్నం చేసింది. దేశవ్యాప్తంగా కీలకనగరాలలో మద్యం విక్రయాల ప్రీమియమైజేషన్ పెరుగుతుండటంతో ఆల్కోబేవ్ కొనుగోలు అనుభవాలు సైతం సమూలంగా మారుతున్నాయని ఈ అధ్యయనంలో వెల్లడైంది.భవిష్యత్‌లో ఈ పరిశ్రమను సమూలంగా మార్చే కీలక అంశాలను గురించి ఈ అధ్యయనం ఏం వెల్లడించిందంటే...ప్రీమియం ఔట్‌లెట్ల వద్దకు మహిళలు రావడం పెరుగుతుంది ? ప్రీమియమైజేషన్ తరువాత మహిళలు లిక్కర్ స్టోర్లకు రావడం గతం కంటే పెరిగింది. సాధారణ స్టోర్లకు 2% మంది మహిళలు మాత్రమే వస్తే, ప్రీమియం స్టోర్లకు 10% మంది కి పైగా మహిళలు వస్తున్నారు. ప్రీమియం లిక్కర్ స్టోర్లు అందిస్తోన్న భద్రత, తమకు కావాల్సిన బ్రాండ్లను ఎంచుకునే స్వేచ్ఛ దీనికి కారణంగా నిలుస్తుంది.ఈ ప్రీమియం ఔట్‌లెట్లు సురక్షిత, ఆహ్లాదకరమైన వాతావరణం అందించడం వల్ల 63% మంది మహిళలు ఒంటరిగానే ఈ స్టోర్లకు వస్తుంటే, కేవలం 37 % మంది మాత్రం సహచరులతో కలిసి వస్తున్నారు. అంతేకాదు, ప్రీమియం లిక్కర్ స్టోర్లకు ఒకసారి వచ్చిన మహిళలు సరాసరిన 702 రూపాయల బిల్ చేస్తుంటే, మగవారు కేవలం 468 రూపాయల బిల్లు మాత్రమే చేస్తున్నారు. ఈ ప్రీమియం స్టోర్లను సందర్శించే వారిలో అధికశాతం మంది ప్రీమియం లిక్కర్ (విస్కీ 18%, బీర్ ?34% తీసుకుంటున్నారు) కోరుకుంటే, రెగ్యులర్ ఔట్‌లెట్స్‌లో కేవలం 5% విస్కీ, 18% బీర్ కోరుకుంటున్నారు అని అధ్యయనంలో వెల్లడైంది. ఈ ప్రీమియం స్టోర్లలో కొనుగోళ్లు చేసేవారిలో ఎక్కువమంది 41 సంవత్సరాలకు పైబడిన వారే అని వెల్లడించిందీ అధ్యయనం.ఈ సందర్భంగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నీతా కపూర్ మాట్లాడుతూ "ఆల్కోబేవ్ పరిశ్రమలో బ్రౌజింగ్, ప్రయోగాత్మకత ధోరణిని ప్రీమియం లిక్కర్ స్టోర్లు అందిస్తున్నాయి. ఈ అధ్యయనం వెల్లడించే దాని ప్రకారం మహిళలతో పాటుగా పెద్ద వయసు వ్యక్తులు ఈ ప్రీమియం స్టోర్లకు ప్రాధాన్యతనిసున్నారు. భారతదేశంలో 2018లో 29.3 కోట్ల మంది మద్యప్రియులు ఉంటే 2030 నాటికి ఆ సంఖ్య 38.6 కోట్లకు చేరనుందని అంచనా. ప్రీమియం స్టోర్లలో అత్యుత్తమ వెరైటీ, ప్రయోగాత్మకత వంటివి ఈ రంగంలో మరిన్ని నూతన ధోరణులు పుట్టుకువచ్చేందుకు తోడ్పడతాయి"అని అన్నారు.

# మహనీయుల స్ఫూర్తి తో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

## -మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 11: (నేటినిజం ప్రతినిధి): మహనీయుల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగుతూ మహోన్నతులుగా ఎదగాలని వేములవాడ మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ×భారత స్వతంత్ర వజ్రోత్సవాల్లో× భాగంగా మనకు స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు వివిధ కార్యక్రమాల్లో భాగంగా గురువారం మున్సిపల్ పాలకవర్గం, వేములవాడ టౌన్ పోలీస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫ్రీడమ్ 2 కెరన్ కు ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి హాజరై జెండా ఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితం వల్లే మనకు స్వతంత్రం వచ్చిందని మనకు స్వాతంత్రం వచ్చి75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మహనీయుల త్యాగాలను స్మరిస్తూ ప్రజలలో దేశభక్తిని పెంపొందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ 15 రోజులపాటు భారత వజ్రోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు వారి ఇంటి పై వారే జెండా ఎగర వేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వాం కల్పించిదని ప్రతి ఒక్కరు కూడా ఫ్లాగ్ ఆఫ్ కోడ్ ను అనుసరిస్తూ భారత జాతీయ జెండా గౌరవానికి భంగం కలగకుండా వారి ఇంటి పై భారత జాతీయ జెండా ను ఎగరవేసి జెండా గౌరవాన్ని దేశభక్తిని ప్రపంచానికి తెలియజేయాలని భారత గడ్డపై పుట్టిన ప్రతి ఒక్క పౌరుడు ఈ వజ్రోత్సవాల కార్యక్రమంలో భాగస్వాములు అయి రాబోయే తరాలకు స్ఫూర్తినివ్వాలని వారన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఈ ఫ్రీడమ్ 2 కె .రన్ లో విజయం సాధించిన గర్ల్స్, బాయ్స్ కు,పోలీస్ శాఖ వారు మొదటి,ద్వితీయ,తృతీయ బహుమతులను అందించారు,ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్యామ్ సుందర్ రావు ,పట్టణ సీఐ వెంకటేష్ కౌన్సిలర్లు,లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు, పాత్రికేయ మిత్రులు,పోలీస్,ఫైర్ మున్సిపల్ సిబ్బంది,గురుకుల స్కూల్ విద్యార్థులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com